



# ప్రతి రోజు

తెలుగు దిన పత్రిక


PRGI No: TNBIL/25/A0852

PRATI ROJU

www.pratiroju.in

8608296990








సంపుటి : 01 | సంచిక : 227 | పేజీలు : 08 | CHENNAI | మంగళవారం | 27 - 01 - 2026 | వెల : 5

Volume : 01 | Issue : 227 | Pages 08 | CHENNAI | Tuesday | 27 - 01 - 2026 | Price : Rs. 5

CIRCULATED By: CHENNAI, CHITHOOR, GUNTUR, HYDERABAD, KRISHNA, NELLORE, PRAKASAM, VIJAYAWADA, VIZAG, WEST GODAVARI





## ఏపీలో ఆ భూములకు మార్కెట్ ధరలు పెంపు

- ఫిబ్రవరి 1 నుంచి అమలు
- ఏపీలో పట్టణ ప్రాంత భూముల విలువలు పెంపు
- ఫిబ్రవరి 1 నుంచి 10 శాతం పెరగనున్న మార్కెట్ విలువ
- ప్రభుత్వ ఆదాయం పెంచడమే లక్ష్యంగా నిర్ణయం
- జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కొత్త విలువల సవరణ
- రూ.11,221 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం

# కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

- కర్తవ్యపథ్‌లో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు
- వేడుకలపై పూలవర్షం కురిపించిన 4 ఎంఐ-17 హెలికాప్టర్లు
- పరేడ్‌లో పాల్గొన్న ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక బృందం
- ఆపరేషన్ సిందూర్ ఆయుధ వ్యవస్థను ప్రదర్శించిన త్రివిధదళాలు
- అనంతరం రోదసీ యాత్ర చేసిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అశోక్ చక్ర ప్రదానం
- సైన్యంలో వివిధ విభాగాలకు నాయకత్వం వహిస్తున్నసైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి వందనం సమర్పించారు



ఢిల్లీ : దేశ రక్షణ సామర్థ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ 77వ గణతంత్ర వేడుకలు దేశ రాజధాని ఢిల్లీలో అంబరాన్నంటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. తొలుత రాష్ట్రపతి భవన్ నుంచి విదేశీ అతిథులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంప్రదాయ గుర్రపు బగ్గీలో అశ్విక దళంతో కలిసి కర్తవ్యపథ్‌కు బయలుదేరారు. కర్తవ్య పథక్‌కు చేరుకున్న రాష్ట్రపతికి, విదేశీ అతిథులు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌కు ఉపరాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు స్వాగతం పలికారు. వేదికపైకి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. వెంటనే సైనికులు గౌరవ సూచకంగా శతఘ్నిలు పేల్చారు.అనంతరం రోదసీ యాత్ర చేసిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము అశోక్ చక్రను ప్రదానం చేశారు. తర్వాత జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో మొదట కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. - మిగతా 2 లో




# కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ వ్యూహం

- ఏపీకి నిధులు రాబట్టాలని ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం
- పార్లమెంటు బడ్జెట్ సమావేశాలపై టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీకి అత్యధిక నిధులు రాబట్టాలని ఎంపీలకు స్పష్టమైన ఆదేశం
- అమరావతికి రెండో విడత నిధులు, పోలవరం పూర్తికి సహకారం కోరాలని సూచన
- విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పిలుపు

అమరావతి : త్వరలో జరగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ ఎంపీలకు కీలక దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రానికి - మిగతా 2 లో

# మోదీని ఆకట్టుకున్న ‘ఇయర్ ఆఫ్ ద ఫ్యామిలీ‘

- మోదీని ఆకట్టుకున్న యూఏఈ ‘ఇయర్ ఆఫ్ ద ఫ్యామిలీ‘ కాన్సెప్ట్
- యూఏఈ ‘ఫ్యామిలీ ఇయర్‘ కార్యక్రమాన్ని ప్రశంసించిన ప్రధాని మోదీ
- ఇది భారత కుటుంబ వ్యవస్థతో సమానమని వ్యాఖ్య
- మన్ కీ బాత్‌లో గుజరాత్‌లోని చందంకి గ్రామ ప్రస్తావన
- గ్రామంలోని సామూహిక వంటగది వల్లే ఇళ్లలో వంట చేయరని వెల్లడి



ఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) చేపట్టిన ‘ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ‘ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఇది భారతీయ కుటుంబ విలువలకు అద్దం పడుతోందని, కుటుంబ బంధాలను బలోపేతం చేసే గొప్ప చొరవ అని కొనియాడారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం ‘మన్ కీ బాత్‘లో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కుటుంబ వ్యవస్థలకు లభిస్తున్న గౌరవాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రధాని గుజరాత్‌లోని చందంకి గ్రామంలో ఉన్న ఓ ప్రత్యేక సంప్రదాయాన్ని ఉదహరించారు. ఆ గ్రామంలోని ప్రజలు, ముఖ్యంగా పెద్దవారు తమ ఇళ్లలో వంట చేయరని, గ్రామంలోని సామూహిక వంటశాల (కమ్యూనిటీ కిచెన్) ద్వారా అందరూ కలిసి - మిగతా 2 లో

# టీవీకే పార్టీ ఎన్నికల గుర్తు ‘విజిల్‘ను ఆవిష్కరించిన విజయ్




- టీవీకే పార్టీకి విజిల్ గుర్తు కేటాయించిన ఎన్నికల సంఘం
- నేడు మహాబలిపురంలో కార్యకర్తల సమావేశం
- సమర శంఖం పూరించిన ‘దళపతి‘ విజయ్
- వేదికపై స్వయంగా విజిల్ వేసి, రాబోయే ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- రెండు ద్రావిడ పార్టీలు బీజేపీకి లొంగిపోయాయని విజయ్ ఆరోపించారు




## సినీ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లకు ‘పద్మ శ్రీ‘

- మొత్తం 113 మంది ‘పద్మ శ్రీ‘
- కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి పద్మ పురస్కారాల ప్రకటన
- వివిధ రంగాలకు చెందిన 113 మంది ప్రముఖులకు పద్మశ్రీ అవార్డులు
- తెలుగు రాష్ట్రాల నుంచి మురళీ మోహన్, దీపికా రెడ్డి, గద్దె రాజేంద్ర ప్రసాద్‌లకు పురస్కారం
- మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, రామారెడ్డి మామిడిలకు గౌరవం
- క్రీడాకారులు రోహిత్ శర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు పద్మశ్రీ




## ‘షీ టీమ్స్’.. ఆడబిడ్డల జోలికొస్తే.. కఠిన చర్యలు తప్పవు

- సీపీ సజ్జనార్ హెచ్చరిక
- మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ, వేధింపులకు పాల్పడే ఆకతాయిల ఆటకట్టించడంలో హైదరాబాద్ షీ టీమ్స్ మరోసారి తమ సమర్థతను చాటుకున్నాయి
- ఏడాదిలో మొత్తం 1149 ఫిర్యాదులు అందంగా, వాటన్నింటినీ షీటీమ్స్ అత్యంత బాధ్యతాయుతంగా పరిష్కరించాయి

# సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి



- హరీశ్ రావు సంచలన ఆరోపణలు
- సింగరేణిలో భారీ అవినీతి జరిగిందన్న హరీశ్ రావు
- సీఎం రేవంత్ సూత్రధారని, ఆయన బావమరిది లబ్ధిదారుడని ఆరోపణ
- సైట్ విజిట్ సర్టిఫికెట్ టెండర్లను రద్దు చేసి, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- సింగరేణి లాభాలను దాచిపెట్టి కార్మికుల బోనస్ తగ్గించారని విమర్శ
- అవినీతిపై కేంద్రం మౌనం వీడాలని, బీజేపీ-కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపణ

హైదరాబాద్ : సింగరేణి కాలరీస్‌లో భారీ అవినీతి జరిగిందని, దీని వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ‘సైట్ విజిట్ సర్టిఫికెట్‘ నిబంధనతో - మిగతా 2 లో

# నోటిఫికేషన్‌కు ముందే పురపోరుకు సిద్ధం

## నువ్వా నేనా అంటున్న పార్టీలు

- పుర పోరులో గెలుపు తమదనే ధీమా వ్యక్తం చేస్తున్న పార్టీలు
- గత 10 ఏళ్లలో చేయని అభివృద్ధిని 2 సంవత్సరాల్లోనే చేసామన్న కాంగ్రెస్
- మున్సిపాలిటీ, కార్పోరేషన్‌కి సీనియర్ నాయకుడికి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు
- తప్పకుండా అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని విజయ బావుటా ఎగరేస్తామని ధీమా వ్యక్తం
- అభ్యర్థుల గుర్తింపు బాధ్యతలని అప్పగించడంతో క్షేత్రస్థాయిలో అధ్యయనం




హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలను ఎలా మట్టుబెట్టాలో ప్రణాళికలు రచిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ, అభిప్రాయాలు సేకరిస్తున్నాయి. గెలుపు గుర్రాల ఎంపికను చేపట్టేందుకు పార్టీలోని సీనియర్ నేతలకు బాధ్యతలను అప్పగిస్తున్నాయి. పుర పోరులో అన్నింటా గెలుపు తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

**నోటిఫికేషన్‌కు ముందే పోరు :** ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే పురపోరుకు పార్టీలన్నీ సిద్ధమయ్యాయి. తప్పకుండా అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని విజయ బావుటా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ప్రధానంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఇన్‌ఛార్జులుగా నియమితులైన మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించారు.

**వార్డుకు 5 లేదా ఆరుగురు అభ్యర్థులు :** అభ్యర్థుల గుర్తింపు బాధ్యతలని అప్పగించడంతో క్షేత్రస్థాయిలో అధ్యయనం ప్రారంభించారు. ప్రతి వార్డుకు 5 నుంచి ఆరుగురు అభ్యర్థులను ఎంపిక చేయాలని పీసీసీ సూచించింది. పార్టీలో కొత్త, పాత నేతల మధ్య సమన్వయం కుదర్చడమే పెద్ద సవాలుగా భావిస్తుంది. రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికలను రెఫరెండంగా భావిస్తున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు . - మిగతా 2 లో

# సంపాదకీయం

## అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అసమానతల భారత్

మూడున్నర దశాబ్దాల క్రితం నాటి ప్రధాని పీవీ నరసింహారావు కొన్ని అనివార్య పరిస్థితుల్లో దేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వల్ల, ఆ తదుపరి వచ్చిన ప్రపంచీకరణ పుణ్యమా అని, పేదలకూ సంపన్నులకూ మధ్య పూడ్చలేనంత వ్యత్యాసం ఏర్పడింది. ఆర్థిక సంస్కరణల వల్ల సృష్టించబడే సంపద అట్టడుగున ఉన్న పేదల వరకూ చేరుతుందనీ, దానిని 'ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్' అంటారనీ అప్పట్లో కొందరు ఆర్థికవేత్తలు, పాలకులు ఊదరగొట్టారు. అయితే, సంస్కరణల పేరుతో సాగిన ప్రైవేటీకరణ కారణంగా సృష్టించబడిన సంపదలో సింహభాగం పై స్థాయికి చేరింది. నామమాత్రపు భాగం మాత్రమే కిందికి చేరుకుంది. ఫలితంగా, ఆర్థిక అసమానతలు అంతకుముందెన్నడూ లేనంతగా పెరిగిపోయి, నేడు అది భూమ్యాకాశాలకు మధ్య ఉన్నంత అంతరంగా మారిపోయింది. అందుకనే రాజకీయ నాయకులు కొందరు ఒకప్పుడు ఊతపదంలా ఉపయోగించిన 'ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్' గురించి ఇప్పుడు మాట్లాడటం మానేశారు.ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్ ఏ విధంగా తలక్రిందులైందంటే నేడు దేశంలో 10శాతం ప్రజల వద్ద 77శాతం దేశ సంపద పోగుపడింది. కింది స్థాయిలో ఉన్న 50శాతం మంది ప్రజల వద్ద నామమాత్రంగా 4.1శాతం సంపద మాత్రమే ఉంది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం 202223 ఆర్థిక సంవత్సరంలో 22.3శాతం జాతీయాదాయాన్ని 1శాతం మంది ఎగరేసుకుపోయారు. ఇది ఒకప్పటి రాచరిక వ్యవస్థలో అసమానతల కంటే ఎక్కువ. ఇంకా విపులంగా చెప్పాలంటే, ప్రముఖ అమెరికన్ పత్రిక 'ఫోర్బ్' కథనం ప్రకారం, 1991లో భారతదేశంలో ఒకే ఒక్క బిలియనీర్ ఉన్నాడు. 3 దశాబ్దాల కాలంలో అమలైన సంస్కరణల ఫలితంగా, బిలియనీర్‌ల సంఖ్య 162కు చేరుకొంది. ఈ 162 మంది నయా కుబేరుల సంపద ఎకాఎకిన జాతీయాదాయం పెరుగుదలలో 25శాతంగా ఉంది!ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడాన్ని ఎవ్వరూ తప్పుపట్టవలసిన పనిలేదు. కానీ, వాటి ప్రయోజనాల్ని కొందరు పారిశ్రామికవేత్తలు పొందుతున్న తీరు, అందుకు కొందరు పాలకులు సహకరిస్తున్న విధానం, వారికి లబ్ధి చేకూరేలా తీసుకుంటున్న పాలసీల కారణంగా సంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారు. ముఖ్యంగా, అసంబద్ధమైన పన్ను విధానాలను అవలంబించడం వల్ల జాతీయాదాయానికి భారీగా గండిపడుతున్నది. దేశ జనాభాకు చేరవలసిన సంపద గద్దల్లాంటి కొందరికి ఫలహారంగా మారిపోతున్నది. ఫలితంగా, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేయాల్సిన దుర్గతి పట్టింది. సహజ వనరుల్ని కొద్దిమందికి ధారాదత్తం చేయకుండా ఉంటే, ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.పేదలు మరింత పేదలు కావడానికి, మధ్యతరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధాన కారణాలు ఈ వర్గాల వారికి విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడమే! సరైన ఆదాయంలేని పేద గ్రామీణ ప్రాంతాల ప్రజలలో పోషకాహార లోపం వల్ల రోగనిరోధక శక్తి క్షీణించి, వారు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. వారికి ప్రభుత్వపరంగా అందే వైద్యం అందుబాటులో లేక, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి దోపిడీకి గురవుతున్నారు. ఇక 'విద్య'దీ ఇదే తంతు. ప్రభుత్వ పాఠశాలల్లో అందే విద్యపై నమ్మకం కోల్పోయి, తాహతుకు మించిన ప్రైవేటు బడులకు తమ పిల్లల్ని పంపించి చదివిస్తున్నారు ఆ పేద తల్లిదండ్రులు. ఫలితంగా మరింతగా అప్పుల ఊబిలోకి జారిపోతున్నారు.కరోనా సమయంలో కుప్పకూలిన ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమ)లు ఇప్పటి వరకూ కోలుకోలేదు. కారణం వాటిని గాడిలో పెట్టగల ప్రోత్సాహకాలు అరకొరగా అందడమే! నిజానికి భారత ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలే వెన్నెముక. దేశంలోని ప్రతి నగరం, పట్టణంలో రోడ్ల మీద కన్పించే తోపుడుబళ్ల వ్యాపారాలు మొదలుకొని, ఏటా 10 నుంచి 20 లక్షల టర్నోవర్ ఉండే చిన్న చిన్న వ్యాపారాల మీద ఆధారపడి సుమారు 20కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. రోడ్ల విస్తరణ, బైపాస్ రోడ్లు వేయడం, ప్రభుత్వాల నుంచి ఎటువంటి సబ్సిడీలు అందకపోవడం తదితర కారణాల వల్ల, స్వయం ఉపాధి పొందుతున్న వీధి వ్యాపారులు లక్షల సంఖ్యలో రోడ్డున పడ్డారు. మరోపక్క వ్యవసాయ రంగంలోని చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం గిట్టుబాటుకాక, సాగుకు స్వస్తి పలికినట్లు, వీరి సంఖ్య దేశవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలుగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

# ఏపీలో ఆ భూములకు మార్కెట్ ధరలు పెంపు

**మొదటిపేజీ తరువాయి –** ఏపీలోని పట్టణ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను పెంచుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భూముల విలువలను 10 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త ధరలు రాబోయే ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంతో పాటు అధికారిక విలువకు, వాస్తవ మార్కెట్ విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.గతేడాది ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూముల విలువలను 5 నుంచి 10 శాతం వరకు సవరించారు. అయితే, ఈసారి పెంపును కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం చేయడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొన్నిచోట్ల అశాస్త్రీయంగా ధరలు పెంచారనే విమర్శల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని ప్రాంతాల్లో ధరలను తగ్గించడం లేదా స్థిరంగా ఉంచడం చేసింది. తాజాగా మళ్లీ పట్టణ ప్రాంతాల్లో ధరలను సవరిస్తూ నిర్ణయం తీసుకుంది.స్థానిక పరిస్థితులకు అనుగుణంగా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కమిటీలు ఈ విలువల సవరణను ఖరారు చేస్తాయి. ఆయా ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, రోడ్ల కనెక్టివిటీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ పెంపు ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సవరించిన ధరల వివరాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.202425 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.8,843 కోట్ల ఆదాయం రాగా, 202526 సంవత్సరానికి గాను రూ.11,221 కోట్లను లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇప్పటికే ఈ లక్ష్యంలో జనవరి 9 నాటికి రూ.8,391 కోట్లు వసూలు కావడం విశేషం. తాజా పెంపుతో ప్రభుత్వ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది.

# మోదీని ఆకట్టుకున్న 'ఇయర్ ఆఫ్ ద ఫ్యామిలీ

**మొదటిపేజీ తరువాయి –** భోజనం చేస్తారని వివరించారు. ఈ విధానం ప్రజల మధ్య ఐక్యతను, కుటుంబ భావనను పెంపొందిస్తోందని మోదీ అన్నారు.ఇటీవల భారత పర్యటనకు వచ్చిన యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నహ్యాన్‌తో జరిగిన సంభాషణను ప్రధాని గుర్తు చేసుకున్నారు. 2026వ సంవత్సరాన్ని యూఏఈ 'ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ'గా ప్రకటించిందని ఆయన తనతో చెప్పినట్లు మోదీ తెలిపారు. ప్రజల మధ్య సామరస్యం, సామాజిక ఐక్యతను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని యూఏఈ అధ్యక్షుడు వివరించినట్లు పేర్కొన్నారు.యూఏఈ చేపట్టిన ఈ కార్యక్రమం నిజంగా ప్రశంసనీయమని మోదీ పేర్కొన్నారు. ఇటువంటి సామాజిక, సాంస్కృతిక విలువలపై ఇరు దేశాల మధ్య చర్చలు జరగడం భారత్-యూఏఈ బలమైన సంబంధాలకు నిదర్శనమని ఆయన అభిప్రాయ పడ్డారు.2026ను 'కుటుంబ సంవత్సరం'గా ప్రకటించిన యూఏఈ.. కుటుంబ బంధాలే దేశానికి పునాది.యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026 సంవత్సరాన్ని 'కుటుంబ సంవత్సరం' (ఇయర్ ఆఫ్ ది ఫ్యామిలీ)గా పాటిస్తున్నట్లు యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నహ్యాన్ ప్రకటించారు. అబుదాబిలో జరిగిన 2025 వార్షిక ప్రభుత్వ సమావేశాల సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. దేశ భవిష్యత్తు, సుస్థిరతకు కుటుంబ వ్యవస్థే పునాది అని ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోందని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది.ఓమిరేటీ కుటుంబాల శ్రేయస్సు, స్థిరత్వం, బలోపేతమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అధ్యక్షుడు స్పష్టం చేశారు. బలమైన, సుస్థిరమైన కుటుంబాలే దేశ దీర్ఘకాలిక ప్రగతికి ఆధారం అని, కుటుంబ వృద్ధి జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశమని ఆయన పేర్కొన్నారు. దేశ జాతీయ గుర్తింపు, భద్రత, సమృద్ధిలో కుటుంబ శ్రేయస్సు అంతర్భాగమని



నొక్కిచెప్పారు. ఐక్యత, సహకారం, సానుభూతి వంటి విలువలను ప్రోత్సహించి, వాటిని భవిష్యత్ తరాలకు అందించడం కూడా ఈ కార్యక్రమ లక్ష్యాల్లో ఒకటి.

# టీవీకే పార్టీ ఎన్నికల గుర్తు 'విజిల్'ను ఆవిష్కరించిన విజయ్

**మొదటిపేజీ తరువాయి –** తమిళనాడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమైన నటుడు విజయ్, తన పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ఎన్నికల గుర్తు 'విజిల్'ను ఆవిష్కరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐఏడీఎంకేలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.చెన్నై సమీపంలోని మహాబలీపురంలో జరిగిన పార్టీ కార్యకర్తల భారీ సమావేశంలో విజయ్ ఈ గుర్తును ప్రకటించారు. వేదికపై స్వయంగా విజిల్ వేసి, రాబోయే ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డీఎంకే పాలనను 'దుష్ట శక్తి' అని, గత ఏఐఏడీఎంకే ప్రభుత్వాన్ని 'అవినీతి శక్తి' అని అభివర్ణించారు. "ఈ




దుష్ట శక్తి గానీ, ఆ అవినీతి శక్తి గానీ తమిళనాడును పాలించడానికి వీల్లేదు. దానిని ఎదుర్కొనే ధైర్యం టీవీకేకు మాత్రమే ఉంది" అని స్పష్టం చేశారు.రెండు ద్రావిడ పార్టీలు బీజేపీకి లొంగిపోయాయని విజయ్ ఆరోపించారు. ఏఐఏడీఎంకే బహిరంగంగా లొంగిపోతే, డీఎంకే పరోక్షంగా లొంగిపోయిందని విమర్శించారు. "మేము ఎవరి ఒత్తిడికీ తలొగ్గం. ఈ ముఖం చూస్తే ఒత్తిడికి లొంగేలా ఉందా?" అని ప్రశ్నించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు."2026 ఎన్నికలు కేవలం ఎన్నికలు కావు, అదొక ప్రజాస్వామ్య యుద్ధం. ఈ యుద్ధానికి మీరే నాయకులు, మీరే కమాండర్లు" అని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. సినిమా కెరీర్ పరంగా ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలను, ఈ నేలను కాపాడటమే తన లక్ష్యమని విజయ్ ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం ఇటీవల టీవీకేకు 'విసిల్' గుర్తును కేటాయించిన విషయం తెలిసిందే.

# కేంద్ర బడ్జెట్‌పై టీడీపీ వ్యూహం

**మొదటిపేజీ తరువాయి –** అత్యధికంగా కేంద్ర నిధులు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీలకు ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించాలని చంద్రబాబు సూచించారు. ముఖ్యంగా అమరావతి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రెండో విడత నిధులు, పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసేందుకు కేంద్ర సహకారం, విశాఖ రైల్వే జోన్‌కు నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, జాతీయ రహదారుల వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇప్పటికే అమరావతికి రూ.15 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో కూడా ఇదే తరహా సాయం కోరుతున్నాం" అని పేర్కొన్నారు. అలాగే, "పోలవరం ప్రాజెక్టును 2027 కల్లా పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాము. ఆ దిశగా కేంద్రం కూడా సహకరించాలి" అని వ్యాఖ్యానించారు.కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, అధిక నిధులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎంపీలందరూ చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం ఆదేశాలతో, బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం తమ వాణిని బలంగా వినిపించేందుకు టీడీపీ ఎంపీలు సిద్ధమవుతున్నారు.

# సినీ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లకు 'పద్మ

**మొదటిపేజీ తరువాయి –** ప్రముఖ సినీ నటులు, నటకిరీటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీ మోహన్‌లకు ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారం లభించింది. కళారంగంలో వారు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం వారిని ఈ అత్యున్నత పౌర పురస్కారంతో గౌరవించింది. 2026 సంవత్సరానికి గాను గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శనివారం రాత్రి పద్మ పురస్కారాల జాబితాను విడుదల చేసింది.ఈ ఏడాది మొత్తం 131 మందిని పద్మ అవార్డులు వరించాయి. ఇందులో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు ప్రముఖులు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజేంద్ర ప్రసాద్, మురళీ మోహన్‌లతో పాటు, మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి (సాహిత్యం, విద్య)లకు పద్మశ్రీ లభించింది. తెలంగాణ నుంచి చంద్రమౌళి గడ్డమనుగు (సైన్స్ అండ్ ఇంజనీరింగ్), దీపికా రెడ్డి (కళలు), గూడూరు వెంకట్ రావు (వైద్యం) సహా పలువురు ఈ గౌరవాన్ని అందుకున్నారు.కళలు, సామాజిక సేవ, సైన్స్, వాణిజ్యం, వైద్యం, విద్య వంటి వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఏటా ఈ పురస్కారాలను అందజేస్తారు. ఈసారి అవార్డు గ్రహీతలలో 19 మంది మహిళలు, 6 మంది విదేశీ/ఎన్ఆర్ఐలు ఉండగా, 16 మందికి మరణానంతరం ఈ గౌరవం దక్కింది. ఈ పురస్కారాలను మార్చి లేదా ఏప్రిల్ నెలలో



రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ప్రదానం చేస్తారు.

# 'షీ టీమ్స్'.. ఆడబిడ్డల జోలికొస్తే.. కఠిన చర్యలు తప్పవు

**మొదటిపేజీ తరువాయి –** నమ్మి స్నేహం చేశారు. ఆ చనువుతో కొన్ని వ్యక్తిగత ఫొటోలు పంచుకున్నారు. అదే ఇప్పుడు ఆమె మెడకు ఉచ్చులా మారింది. 'డబ్బులిస్తావా..? ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టమంటావా?' అంటూ నిత్యం వేధింపులు. చావలేక.. బతకలేక నరకయాతన అనుభవించిన ఆ యువతి చివరకు 'షీ టీమ్స్'ను ఆశ్రయించి విముక్తి పొందారు. మరొకరు.. రోజూ ఆఫీస్‌కు వెళ్తుంటే చాలు, నీడలా వెంటపడటం.. ప్రేమించకపోతే చంపేస్తానంటూ బెదిరింపులు. ఫోన్ బ్లాక్ చేసినా కొత్త నంబర్లతో బూతులు తిడుతూ పైశాచిక ఆనందం. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ మహిళకు 'షీ టీమ్స్' అండగా నిలిచింది. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే కాదు.. హైదరాబాద్ నగరంలో ఎంతోమంది మహిళలు అనుభవించిన మూగవేదనకు ప్రతిరూపాలు. నగరంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ, వేధింపులకు పాల్పడే ఆకతాయిల ఆటకట్టించడంలో హైదరాబాద్ షీ టీమ్స్ మరోసారి తమ సమర్థతను చాటుకున్నాయి. ఏడాదిలో మొత్తం 1149 ఫిర్యాదులు అందంగా, వాటన్నింటినీ షీటీమ్స్ అత్యంత బాధ్యతాయుతంగా పరిష్కరించాయి.'మహిళల జోలికొస్తే.. ఇక మీ ఆటలు సాగవు. ముఖ్యంగా 'బ్లాక్‌మెయిలింగ్' పేరుతో ఆడబిడ్డలను భయపెట్టాలని చూస్తే, మీ భవిష్యత్తు జైలు గోడల మధ్యే అంతమవుతుంది. సోదరీమణులారా.. అధైర్యపడకండి. మీ వివరాలు బయటపడతాయన్న భయం అస్సలు వద్దు, వాటిని అత్యంత గోప్యంగా ఉంచుతాం. వేధింపులను మౌనంగా భరించకండి.. ఎదురించండి. మీరు ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. మీకు రక్షణ కవచంలా నిలబడటానికి 'షీ టీమ్స్' ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయి. ఆపదలో ఉన్నా, వేధింపులకు గురవుతున్నా తక్షణమే డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నెంబర్ 9490616555 ను సంప్రదించండి' అని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదివారం ఈ వివరాలను ఒక ప్రకటనలో పంచుకున్నారు.

# నోటిఫికేషన్‌కు ముందే పురపోరుకు సిద్ధం

**మొదటిపేజీ తరువాయి –** సచివాలయంలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

**రూ. 170 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనుల :** మున్సిపల్ ఎన్నికలను రిఫరెండంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజలను ఓట్లడిగే హక్కు ఒక్క కాంగ్రెస్‌కే ఉందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. గత 10 ఏళ్లలో చేయని అభివృద్ధిని 2 సంవత్సరాల్లోనే చేసి చూపించామని పునరుద్ఘాటించారు. కేసముద్రం, మహబూబాబాద్ మున్సిపాలిటీలలో 170 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరితో కలిసి కలిసి మంత్రి పొన్నం శంకుస్థాపన చేశారు." నేటి బీఆర్ఎస్, ఎమ్మెల్యే తర్వాత స్థానిక ఎన్నికలు ఓడిపోయింది. అలాంటి పార్టీ ఇవాళ ఈ ప్రభుత్వాన్ని విమర్శిస్తోంది. రాజకీయం అంటే విమర్శలు, ప్రతి విమర్శలు మామూలే. కానీ, ఏది మంచి ఏది చెడు అనే ఆలోచన చేసే శక్తి మీకు ఉంది. రేవంత్ రెడ్డి ఈనాటి వరకు ఏమేమి పనులు చెప్పారో అన్ని పనులు చేసే ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించండి. " – పొన్నం ప్రభాకర్, రవాణాశాఖ మంత్రి"బడి కడితే తిడతారు. బస్టాండ్ కడితే తిడతారు. ఇలా ఇతరులపై బురద జల్లడం మానుకొండి. వాస్తవాల్లోకి వచ్చి, ఒక నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంలా




మాట్లాడండి." – **సీతక్క, మహిళ,శిశు అభివృద్ధి శాఖ మంత్రి**

**గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు :** పురపాలక ఎన్నికల కోసం బీఆర్ఎస్ ఇన్‌ఛార్జులను నియమించింది. ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాల్టీల వారీగా సమన్వయ కర్తల జాబితాను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌కి సీనియర్ నాయకుడికి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు :** జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. కొత్తగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీ పరిధిలో 18 వార్డులను గెలిచి అధినాయకుడు కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బెదిరింపు ధోరణిలో వ్యవహరిస్తుందని ఎవరు భయపడాల్సిన అవసరం లేదని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

**ప్రతిపక్ష నేతలు విమర్శలు :** గత పదేళ్లలో పరుగులు పెట్టిన కరీంనగర్ అభివృద్ధిని కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. రాంనగర్‌లోని మున్నూరు కాపు సంక్షేమ సంఘ భవనాన్ని ప్రారంభించిన మాజీమంత్రి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తాము చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే ప్రజలు తమను ఆశీర్వదిస్తున్నారని అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు చెబుతుండగా, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారంటూ ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు."మీ ముందు పెరిగిన బిడ్డను ఆదరించండి. ఈ బిడ్డలు ఎప్పుడు మీ వెంటే ఉంటారు. అంతే కానీ రాజకీయ స్వార్థం కోసం వచ్చిన వారు కాదు. వీరిని గెలిపిస్తే నన్ను గెలిపించినట్లే.

# కర్తవ్యపథ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల కళాకారులు తమ వాద్య పరికరాలతో వన్ ఇండియా స్ఫూర్తిని చాటారు. నాలుగు హెలికాప్టర్లు సభికులపై పూల వర్షం కురిపించాయి.సైన్యంలో వివిధ విభాగాలకు నాయకత్వం వహిస్తున్నసైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి వందనం సమర్పించారు. అనంతరం యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనికులు కర్నల్ ఫ్రెడరిక్ సైమన్ నేతృత్వంలో వందనం సమర్పించారు. తర్వాత భారత సైనిక సామర్థ్యాన్ని చాటుతూ జరిగిన పరేడ్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఆశ్విక దళం తర్వాత వివిధ ఆయుధాలను ప్రదర్శించారు. ఇదే సమయంలో మూడు ధ్రువ్ హెలికాప్టర్లు ఆపరేషన్ సిందూర్ జెండాను ప్రదర్శించాయి.ఒక పక్క టీ-90 అర్జున యుద్ధ ట్యాంకులు, టీ-90 భీష్మ యుద్ధ ట్యాంకులు పరేడ్‌లో ప్రదర్శనకు రాగా అదే సమయంలో గగన తలంలో అపాచీ హెలికాప్టర్లు దూసుకెళ్లాయి. బీఎంపీ-3 ఇన్‌ఫాంట్రీ యుద్ధ వాహనం, నాగ్ మిసైల్ వ్యవస్థను ప్రదర్శించారు. అన్ని రకాల ఉపరితలాలపైనా ప్రయాణించే వాహనాలు, మనుషులు లేకుండానే నియంత్రించే యుద్ధ వాహనాలను ప్రదర్శించారు. పైలెట్లు అవసరం లేకుండానే లక్ష్యాలను కచ్చితంగా మానవ రహిత విమానాలైన దివ్యాస్త్ర, శక్తిబాన్‌లు ఆకట్టుకున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ధనుష్, అమోఘ్ గన్ వ్యవస్థలు పరేడ్‌లో పాల్గొన్నాయి.52 కాలిబర్ ఆర్టిలరీ గన్స్, దేశ రక్షణకే తలమానికమైన బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థ, సూర్యాస్త్ర క్షిపణి వ్యవస్థలు ఆకట్టుకున్నాయి. శత్రులక్ష్యాలను ఛేధించడమే కాకుండా ప్రత్యర్థులు ప్రయోగించే ఆయుధాలను నిర్వీర్యం చేసే శక్తి ఉన్న ఆకాశ్ గగనతల రక్షణ వ్యవస్థ, అభ్ర ఆయుధ వ్యవస్థలను పరేడ్‌లో ప్రదర్శించారు. ఉపరితలం నుంచి గగనతలంలోని లక్ష్యాల కోసం అభివృద్ధి చేసిన మీడియా రేంజ్ మిసైల్ వ్యవస్థ కూడా పరేడ్‌లో పాల్గొంది. భారత సైన్యానికి చెందిన డ్రోన్ శక్తిని ఈగల్ ఆన్ ఆర్మ్ పేరుతో ప్రదర్శించారు.ఆపరేషన్ సిందూర్ సమయంలో త్రివిధ దళాలను సమన్వయ పరిచిన ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ నమూనా ఆకట్టుకుంది.అంతకుముందు గణతంత్ర దినోత్సవం వేళ దేశం కోసం పోరాడిన అమరవీరులకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. తొలుత దిల్లీలోని వార్ మెమోరియల్ వద్దకు వెళ్లిన ప్రధానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాధిపతులు స్వాగతం పలికారు. తర్వాత వార్ మెమోరియల్ వద్దకు చేరుకున్న ప్రధాని మోదీ పుష్పాంజలి సమర్పించారు. దేశం కోసం పోరాడిన వీరులకు, త్రివిధ దళాల అధిపతులతో కలిసి వందనం చేశారు. తర్వాత అక్కడి పుస్తకంలో తన సందేశం రాశారు.

# సింగరేణి స్కామ్‌లో సీఎం రేవంత్ సూత్రధారి

**మొదటిపేజీ తరువాయి –** జారీ చేసిన టెండర్లన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ కుంభకోణంపై జ్యుడీషియల్ లేదా సీబీఐ విచారణ జరపాలని కోరారు.ఈ కుంభకోణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని, ఆయన బావమరిది సృజన్ రెడ్డి ప్రధాన లబ్ధిదారుడని హరీశ్ రావు ఆరోపించారు. నైనీ టెండర్‌ను రద్దు చేయడమే ఇందులో తీవ్ర అక్రమాలు జరిగాయనడానికి నిదర్శనమని అన్నారు. సీఎంకు సన్నిహితులైన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే టెండర్ నిబంధనలను మార్చారని విమర్శించారు. జనవరి 2025లో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేకుండా అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకు ఖరారైన భూపాలపల్లి పనుల టెండర్లను, మూడు నెలల్లోనే మే 2025లో కొత్త నిబంధనలతో ఎందుకు జారీ చేశారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం బంధువుకు చెందిన కంపెనీకి అంచనా కంటే ఎక్కువ ధరకు పనులు అప్పగించారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానంతో మొదటి లబ్ధి పొందింది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' అని ఆయన పేర్కొన్నారు. అవినీతిపై సూటిగా సమాధానం చెప్పకుండా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంబంధం లేని పత్రాలు చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. కుంభకోణానికి బాధ్యులెవరు, ఎంత నష్టం వాటిల్లింది, ఎవరు లబ్ధి పొందారనే మూడు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.



సింగరేణికి వచ్చిన సుమారు రూ. 6,900 కోట్ల లాభాలను కాంగ్రెస్ ప్రభుత్వం దాచిపెట్టి, కార్మికుల బోనస్‌ను తగ్గించిందని కూడా ఆయన ఆరోపించారు. సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఈ అవినీతిపై మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందని, సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు.

ప్రతిరోజు
మంగళవారం 27 - 01 - 2026

# అవినీతి రహిత పాలనే టీవీకే ధ్యేయం

## టీవీకే అధ్యక్షుడు విజయ్







**మామల్లపురం :** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే గెలుపొంది అవినీతి రహిత పాలన అందజేస్తుందని టీవీకే అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. ఆదివారం చెంగల్పట్టు జిల్లా మామల్లపురంలోని ఓ హోటల్‌లో పార్టీ సర్వసభ్య సమావేశం విజయ్ నేతృత్వంలో జరిగింది. రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యనిర్వాహకులు పాల్గొన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల్లో పోటీకి విజిల్ గుర్తు కేటాయించిన నేపథ్యంలో వారంతా విజిల్స్ ఊదుతూ విజయ్‌కు స్వాగతం పలికారు. అనంతరం విజయ్ ప్రసంగిస్తూ... తాను ఒత్తిడికి గురయ్యే వ్యక్తిని కాదన్నారు. అధికారంలో ఉన్నవారు, గతంలో కొనసాగినవారు ప్రజలను మోసగించే విధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీవీకే అఖండ విజయం సాధిస్తుందని, తమ పాలనలో అవినీతి రహిత పాలన అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొన్ని దుష్టశక్తులు ఉన్నాయని, అవి మళ్లీ అధికారంలోకి రాకూడదని, తనపై ఎంత ఒత్తిడి వచ్చినా తాను బానిసగా వ్యవహరించనని, తాను ప్రజలను కాపాడటానికి రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. అనంతరం కేఏ సెంగోట్టైయ్యన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో డీఎంకేను ఓడించగల నాయకుడు విజయ్ అని అన్నారు. తాను రాజకీయాల్లో ఎంజీఆర్ లాంటి నాయకులను చాలా మందిని చూశానని, కానీ నటుడు విజయ్ తన రూ.వెయ్యి కోట్ల ఆదాయాన్ని వదులుకొని రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సి ఆనంద్, నాంజిల్ సంపత్, ఆదవ్ అర్జున తదితరులు పాల్గొన్నారు. ముందుగా వేదికపై ఉంచిన భాషోద్యమ అమరుల చిత్రపటాలకు విజయ్ పుష్పాంజలి ఘటించారు.

### టీవీకేలో చేరిన మాజీ మంత్రి కేపీ కృష్ణన్

మామల్లపురంలో ఆదివారం టీవీకే అధ్యక్షుడు విజయ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న అన్నాడీఎంకే మాజీ మంత్రి కేపీ కృష్ణన్ విజయ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఓపీఎస్ మద్దతుదారుడైన ఈయన గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరపున శ్రీరంగం నియోజకవర్గం నుంచి పోటీ చేశారు.

# సీట్ల సర్దుబాటుపై డీఎంకే కసరత్తు

## 170 స్థానాల్లో పోటీకి నిర్ణయం

## కాంగ్రెస్‌కు 25, మిగతా పార్టీలకు 39

## అంచనాల జాబితా సిద్ధం

**చెన్నై :** శాసనసభ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో ఇప్పటికే కూటమి దాదాపు ఖరారైన ధీమాతో ఉన్న డీఎంకే నాయకత్వం ఏకంగా సీట్ల సర్దుబాటు వ్యవహారంపై దృష్టి పెట్టింది. గత ఎన్నికల తరహాలో అదే సంఖ్య స్థానాల్లో పోటీ చేయాలని, కూటమిలో అదనంగా కొత్త పార్టీలు చేరితే వాటికి మిత్రపక్షాల సీట్ల నుంచి సర్దుబాటు చేయాలని, 170 స్థానాల నుంచి తన అభ్యర్థులను బరిలోకి దించాలని భావిస్తోంది. ఆ మేరకు కాంగ్రెస్‌కు 25, మిగతా పార్టీలకు 39 సీట్లను కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం.

**మిత్రపక్షాల మొండిపట్టు**

ప్రస్తుతం డీఎంకే కూటమిలో కొనసాగుతున్న పార్టీలు రానున్న శాసనసభ ఎన్నికల్లోనూ కొనసాగే సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో కూటమి నాయకత్వం నుంచి అదనపు సీట్లు, అనుకూలమైన నియోజకవర్గాలను పొందడంపై కూటమి పార్టీలు దృష్టి సారించాయి. 50కుపైగా స్థానాలను పొందాలని కాంగ్రెస్, ఈ ఎన్నికల్లోనైనా రెండంకెల సంఖ్యలో సీట్లు పొందాలని ఇతర పార్టీలు భావిస్తున్నాయి. డీఎంకేతో చర్చలకు ఐదుగురు సభ్యులతో కమిటీని కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసింది. డీఎంకే నాయకత్వం మాత్రం గత ఎన్నికల్లోని సీట్ల సర్దుబాటు విధానాన్నే ప్రస్తుత ఎన్నికల్లోనూ పాటించాలని భావిస్తున్నట్లు సమాచారం. 2021 శాసనసభ ఎన్నికల్లో డీఎంకే 174 స్థానాల్లో పోటీ చేసి కాంగ్రెస్‌కు 25, ఇతర పార్టీలకు 35 సీట్లు కేటాయించింది. ఆ ఎన్నికల్లో డీఎంకే 133 స్థానాల్లో గెలిచి వ్యక్తిగత మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఎన్నికల్లోనూ అదే స్థాయి స్థానాల్లో పోటీ చేస్తే మాత్రమే వ్యక్తిగత మెజారిటీతో మళ్లీ అధికారాన్ని ఏర్పాటు చేయగలమని డీఎంకే భావిస్తోంది. కూటమి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నా వ్యక్తిగత మెజారిటీ లేకపోతే అధికారం ఏర్పాటు కోసం కూటమి పార్టీల డిమాండ్లకు నిస్సహాయతతో తల వంచాల్సి వస్తుందని భావిస్తోంది.

**వైఖరి తెలపని ప్రేమలత, రామదాసు**

రాష్ట్రంలోని ప్రధాన పార్టీల వరుసలో ఉన్న డీఎండీకే, పీఎంకే (రామదాసు వర్గం) ఇంకా కూటమి ఏర్పాటుపై తమ వైఖరిని స్పష్టం చేయలేదు. చివరి క్షణంలో ఈ పార్టీలు డీఎంకే కూటమిలో చేరే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అలాంటి పరిస్థితి వస్తే కూటమిలోని ప్రధాన పార్టీలు మినహాయించి ఇతర మిత్రపక్షాల సీట్లలో కోత వేసి కొత్త పార్టీలకు సర్దుబాటు చేయాలనే ఆలోచనల్లో డీఎంకే అధిష్ఠానం ఉంది. అప్పుడు 170 స్థానాల్లో తన అభ్యర్థులను పోటీకి దించి మిగతా పార్టీల్లో కాంగ్రెస్‌కు 25, వీసీకే, సీపీఎం, సీపీఐ, ఎంఎన్ఎం, డీఎండీకేలకు 6 చొప్పున, పీఎంకే (రామదాసు వర్గం)కు 4, ఐయూఎంఎల్‌కు 3, ఎంఎంఏకేకు 2 సీట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు, దాని ప్రకారం అంచనాల జాబితాను సిద్ధం చేసుకుందని సమాచారం. రెండంకెల సంఖ్యలో సీట్లు డిమాండ్ చేసే పార్టీలను వాటి ప్రాధాన్యత మేరకు రాజ్యసభ సీట్లు, ఇతర పదవులను చూపించి బుజ్జగించాలని భావిస్తున్నట్లు, ఆ మేరకు డీఎండీకే ప్రధానకార్యదర్శి ప్రేమలతకు రాజ్యసభ సీటు ఆఫర్ చేయడానికీ సిద్ధంగా ఉందని తెలిసింది.

# రాష్ట్ర పూదోటలో విరిసిన 13 పద్మాలు




**చెన్నై :** కేంద్రం ప్రకటించిన ప్రతిష్టాత్మక పద్మ పురస్కారాల జాబితాలో రాష్ట్రానికి చెందిన 14 మంది, పుదుచ్చేరికి చెందిన ఒకరి పేర్లు చోటుచేసుకున్నాయి. రాష్ట్రానికి సంబంధించి పద్మభూషణ్ పురస్కారానికి వైద్యరంగంలో డాక్టర్ కళ్లిపట్టి రామసామి పళనిస్వామి, సామాజిక సేవా రంగంలో ఎం.కె.ఎం.మయిలానందన్ పేర్లు చోటుచేసుకోగా పద్మశ్రీ పురస్కారానికి కళా రంగంలో గాయత్రీ బాలసుబ్రమణియన్, రంజనీ బాలసుబ్రమణియన్, వైద్యరంగంలో హెచ్.వి.హండే, పుణ్యమూర్తి నటేశన్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రంగంలో కె.రామస్వామి, ఐఐటీ మద్రాస్ సంచాలకులు వి.కామకోటి, సివిల్ సర్వీసెస్ విభాగంలో విజయకుమార్, కళల్లో ఓతువర్ తిరుత్తణి స్వామినాథన్, ఆర్.వి.ఎస్.మణి, రాజాసప్తపతి కాళియప్ప గౌండర్, తిరువారూర్ భక్తవత్సలం, సాహిత్యం, విద్యా రంగంలో శివశంకరి పేర్లు చోటుచేసుకున్నాయి. పుదుచ్చేరికి చెందిన కె.పళనివేల్‌ను క్రీడా రంగంలో పద్మశ్రీ వరించింది. గాయత్రీ బాలసుబ్రమణియన్, రంజనీ బాలసుబ్రమణియన్‌కు కలిపి ఒకే అవార్డు ప్రకటించడం గమనార్హం.

# శ్రీశైలంలో రథసప్తమి పూజలు





**శ్రీశైలం :** శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో రథసప్తమి (మాఘ శుద్ధ సప్తమి) పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో సూర్యారాధన జరిపించబడింది. ఈ కార్యక్రమానికి ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవిం చకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు జరగకుండా ఉండాలనీ, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, అన్ని సామాజిక వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు లోక కల్యాణ సంకల్పాన్ని చెప్పడం జరిగింది. తరువాత కలశస్థాపన చేసి కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం వైదికాచార్యులు ఆయా బీజమంత్రాలతోనూ, ప్రత్యేక ముద్రలతోనూ సూర్యనమస్కారాలు చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగానే సూర్యయంత్ర పూజ, వేదపారాయణలు, అరుణపారాయణ, జరిపించబడ్డాయి. అనంతరం సూర్యభగవానుడికి ఉత్తరపూజనము (షోడశోపచారపూజ), నివేదన, మంత్రపుష్పము జరిపించబడ్డాయి. కాగా మన పురాణాలలో ఈ సూర్యారాధన ఎంతో విశేషంగా చెప్పబడింది. సూర్యారాధన వల్ల అనారోగ్యం తొలగి ఆరోగ్యం చేకూరుతుందని పురాణాలు చెబుతున్నాయి. ముఖ్యంగా రథసప్తమి రోజున సూర్యుని ఆరాధించడం ఎంతో ఫలదాయకం. మన్వంతర ప్రారంభంలో సూర్యభగవానుడు మాఘశుద్ధ సప్తమి రోజున మొట్టమొదటిసారిగా తన ప్రకాశాన్ని లోకాలకు అందించాడని చెబుతారు. అందుకే రథసప్తమి రోజును సూర్యజయంతిగా జరుపుకోవడం ఆచారంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. శ్రీనివాసరావు, అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

# జి స్క్వేర్‌లో ఉన్న ఇంటిని ముందస్తు ప్రణాళికతో నిప్పట్టించారు - జనార్ధన రెడ్డి





**బళ్లారి :** జి. స్క్వేర్‌లో మా ఇంటికి నిప్పంటించిన సంఘటన ప్రమాదవశాత్తు జరిగిందని, కొంతమంది యువకులు రీల్స్ తయారు చేస్తున్నప్పుడు జరిగిన ప్రమాదం అని ఎస్పీ డాక్టర్ సుమన్ డి.పెన్నేకర్ శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. జనార్దన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇది ప్రమాదం కాదని, ముందస్తు ప్రణాళికతో చేసిన దురుద్దేశపూరిత చర్య అని మాజీ మంత్రి గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన రెడ్డి అన్నారు. తన ఇంట్లో జరిగిన ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం గురించి ఈరోజు తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెట్రోల్ వేయకుండా మంటలు చెలరేగలేదని అన్నారు. ఇల్లు చాలా సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉందని ఎస్పీ చేసిన ప్రకటన సరైనది కాదు. ఏఎస్పీ రవికుమార్ పోలీసు వేషంలో ఉన్న నేరస్థుడు, రీల్స్ హాస్యాస్పదంగా ఉన్నాయి. కింది స్థాయి అధికారుల మాటలు విన్న ఎస్పీ ఈ విషయం చెప్పారు. వీడియో తీసిన వారిని పోలీసులు అరెస్టు చేశారని పోలీసులు తెలిపారు. కానీ అది వాస్తవం కాదు. అలా చేసిన వ్యక్తులు మరికొందరు, వారు పారిపోయారు. మేము అందించిన వీడియోల ఆధారంగా ఎనిమిది మందిని అరెస్టు చేశారని, వారి నుండి రీల్స్ తయారు చేయించారని, వారు మా ఇంటికి నిప్పంటించి మాకు భయానక వాతావరణాన్ని సృష్టించాలని ఉద్దేశించారని జనార్దన్ రెడ్డి ఆరోపించారు. మేము దీనికి భయపడటం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోంది, కానీ కొన్ని రోజుల్లో మరో సంఘటన జరిగితే మేము ఆశ్చర్యపోనవసరం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి 1న మా ఇంటి సమీపంలో జరిగిన సంఘటనకు సంబంధించి సతీష్ రెడ్డి, భరత్ రెడ్డిలను అరెస్టు చేయాలి. ఈ సంఘటనలో ముగ్గురు వ్యక్తులను, వారి జన్మ పేర్లను మాత్రమే అరెస్టు చేశారని, నిజమైన నిందితులు బయట ఉన్నారని ఆయన పునరుద్ఘాటించారు. భరత్ రెడ్డికి సౌకర్యాలు కల్పించడం మరియు ఈ కేసును కప్పిపుచ్చే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సిఐడికి అప్పగించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సన్న పక్కీరప్ప, బిజెపి నగర శాఖ అధ్యక్షుడు జి. వెంకటరమణ, డాక్టర్ ఎస్.జె.వి.మహిపాల్, కె.ఎస్. దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం నూతన టీడీపీ జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు కు శుభాకాంక్షలు తెలిపిన

## ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ





**ఆలూరు :** అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ నూతనంగా అధ్యక్షులుగా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న పూల నాగరాజు కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ. అనంతపురం పట్టణం కమ్మ భవన్ నందు అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులుగా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న పూల నాగరాజు ను మర్యాదపూర్వకంగా కలిసి, పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గుమ్మనూరు నారాయణ అభిమానులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైలు కింద పడి మాల తలారి నాగరాజు ఆత్మహత్య



**ఆలూరు :** ఆలూరు నియోజకవర్గం, ఆస్పరి మండలం, చిన్నహోతూరు గ్రామానికి చెందిన మాల తలారి నాగరాజు (35) ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆస్పరి నుండి నగరూరు రైల్వే స్టేషన్ మధ్య ముంబై నుంచి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆయన ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు. తలారి నాగరాజు చిన్నతూరు గ్రామస్తులుగా నిర్ధారించారు.

# ఆలూరులో కొనసాగుతున్న రిలే దీక్ష

## 45 వ రోజు దీక్షల్లో మరకట్టు గ్రామ రైతులు




**ఆలూరు :** వెనుకబాటుకు గురైన ఆలూరు ప్రాంతం విద్యా,ఉద్యోగ,ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఆదోని ను జిల్లా గా ప్రకటించాలని ఆలూరు జె ఏ సి నాయకులు కత్తి రామాంజనేయులు,భూపేష్,ఎల్లప్ప అన్నారు. ఆదివారం ఆలూరు జె ఏ సి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష 45 వ రోజుకు చేరుకుంది ఈ దీక్షలో ఆలూరు మండలం మరకట్టు గ్రామ మాజీ సర్పంచ్ ఎల్లప్ప అద్వర్యం లో రైతులు పెద్ద లక్షన్న , షేక్షావలి, పుచ్చిరప్ప, భీమ లింగప్ప, వీరేష్, చంద్రప్ప, బుజ్జరాజు ,రంగన్న, మాల ఎల్లప్ప కూర్చున్నారు. వీరికి సామాజిక కార్యకర్త కమలాకర్ నాయుడు, వైసీపీ నాయకులు కొట్టా ల రాజు సంగీబావం ప్రకటించారు. 5 నియోజక వర్గాల ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఆదోని ను జిల్లా గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు



**విజయవాడ :** విజయవాడలోని కనక దుర్గమ్మ అమ్మవారిని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు..సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన, అనంతరం దుర్గమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా వేదపండితులు ఎం.పి నాగరాజుకి వేదాశీర్వచనాలను అందించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేసవస్త్రాలను అందచేశారు.

# అభాగ్యుల ఆకలి తీరుస్తున్న అభిమానం

## నటుడు కార్తి పేరిట రూ.10కే మధ్యాహ్న భోజనం

## చెన్నై వళసరవాక్కంలో ఫుడ్ సెంటర్ ఏర్పాటు



**చెన్నై :** మహానగరం చెన్నైలో రూ.10కి కనీసం టీ కూడా రాదు. అలాంటిది ఏకంగా మధ్యాహ్న భోజనం పెట్టి పలువురి ఆకలి తీరుస్తున్నారు సినీ నటుడు కార్తి అభిమానులు. ఇలా ఒకట్రెండు రోజులు కాదు. ఏకంగా మూడేళ్లుగా ఈ సేవలను కొనసాగిస్తున్నారు. వళసరవాక్కంలోని తిరువళ్లువర్ సాలై, రామాపురం రోడ్డులో ఆల్ ఇండియా కార్తి ఫ్యాన్స్ క్లబ్ ఉంది. ఈ క్లబ్ తరపున ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివారం మినహా ప్రతిరోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రూ.10కి మధ్యాహ్న భోజనంగా వెజిటబుల్ రైస్ అందిస్తున్నారు. దీనిని బాస్మతి బియ్యంతో తయారు చేయడం గమనార్హం. మొదట్లో 60–70 మంది లబ్ధి పొందగా క్రమేణా ఈ సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ప్రతిరోజు 100–150 మంది వరకు అభాగ్యులు లబ్ధి పొందుతున్నారు. ఫుడ్ సెంటర్ సేవలు ఈ నెల 23న 1000వ రోజుకు చేరుకుంది. మొత్తం 1.50లక్షల మంది లబ్ధి పొందినట్లు క్లబ్ నిర్వాహకులు వెల్లడించారు. ఇక్కడ తినడానికి మాత్రమే కాని, పార్సిళ్లు లేవని తెలిపారు. ఇది వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో మాత్రమే నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

**ఆలోచన వచ్చింది అలా..**

ఆల్ ఇండియా కార్తి ఫ్యాన్స్ క్లబ్ పరిసర ప్రాంతాలకు స్విగ్గి, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ సంస్థల్లో పనిచేసే గిగ్ వర్కర్లు, దినసరి కూలీలు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. మధ్యాహ్న సమయంలో వారిలో పలువురు భోజనానికి హోటళ్లపై ఆధారపడాల్సి ఉంది. ఇదే ఫ్యాన్స్ క్లబ్‌కు చెందిన కొందరిని ఆలోచింప చేసింది. వారి కోసం క్లబ్ తరపున అతితక్కువ ధరకు భోజనం అందించాలనే ఆలోచన వచ్చింది. ఇదే విషయాన్ని క్లబ్ కీలక నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. క్లబ్ పేరిట ఈ పని చేయడానికి నటుడు కార్తి నుంచి కూడా అనుమతి లభించింది. అలా కరోనా కాలంలో తమ ఆలోచనకు కార్యరూపం ఇచ్చారు. క్లబ్ బయట తోపుడు బండిపై భోజనం విక్రయించడం ప్రారంభించారు. అతితక్కువ ధరకే కావడంతో భోజనం కొనడానికి మొదట్లో పలువురు సంశయించారు. కానీ బాస్మతి బియ్యంతో తయారు చేస్తున్నారని తెలుసుకుని సుముఖత చూపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భోజనం తీసుకొని రాగానే గంటలోపే 50కిలోల భోజనం ఖాళీ అయిపోతుందంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు.

# జనం మెచ్చిన వారికే టికెట్లు...!

## పైరవీలకు తావులేదు.. వారసత్వానికి చోటులేదు

## ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యత నాది

## శివరాత్రి లోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి!

## మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి



**తెలంగాణ :** మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుంది.. మనమంతా సిద్ధం కావాలి. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయమే తుది నిర్ణయం. పైరవీలకు ఇక్కడ తావులేదు. జనం కోరుకునే వ్యక్తికే బి-ఫామ్ అందుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వార్డుల నుంచి తరలివచ్చిన పార్టీ ఇంచార్జీలు, ముఖ్య నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

### సర్వేల ఆధారంగానే ఎంపిక

టికెట్ల కేటాయింపుపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. "వారసత్వ రాజకీయాలకు నా వద్ద చోటు లేదు. నా రక్తసంబంధీకులకు ఎవరికీ టికెట్లు ఇవ్వను. ఇప్పటికే రెండు మూడు బృందాలతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేయిస్తున్నాం. ప్రజలు ఎవరినైతే ఆదరిస్తారో, ఎవరికైతే గెలిచే సత్తా ఉందో వారికే అవకాశం దక్కుతుంది. ఓటర్ల మనసు గెలుచుకున్న వారే అభ్యర్థులుగా బరిలోకి దిగుతారు" అని పేర్కొన్నారు.

### రెచ్చగొడితే మోసపోవద్దు

పార్టీలో టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని, అసంతృప్తితో ఇతర పార్టీల వైపు చూడవద్దని మంత్రి సూచించారు. "అధికారంలో ఉన్నాం కాబట్టి అందరికీ ఏదో ఒక రూపంలో సముచిత స్థానం కల్పిస్తాం. కొందరిని కో-ఆప్షన్ సభ్యులుగా, మరికొందరికి నామినేటెడ్ పదవుల ద్వారా గౌరవిస్తాం. పార్టీని కాదని స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని ఎవరైనా రెచ్చగొడితే మోసపోవద్దు. అటువంటి వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది" అని హెచ్చరించారు.

### మోడల్ మున్సిపాలిటీగా చేయడమే లక్ష్యం

ఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా మార్చడమే తన లక్ష్యమని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 15న శివరాత్రి లోపు ఎన్నికలు, కౌంటింగ్, ప్రమాణ స్వీకార కార్యక్రమం అంతా పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### కార్యకర్తలే నా బలం

"మీరు నా కళ్ళు, చెవుల వంటి వారు. మీ కష్టమే నాకు గౌరవం. నేను ఎప్పుడూ కార్యకర్తలను విస్మరించను. ప్రజలతో నిరంతరం మమేకమై ఉండే వారికే నా మద్దతు ఉంటుంది" అని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. అనంతరం ఒక్కో వార్డు నాయకులతో ఆయన ముఖాముఖి చర్చించి, స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# పేద విద్యార్థినిలకు స్ఫూర్తి ఫౌండేషన్ చేయూత

## 25 సైకిళ్లు

## రీయుజుబుల్ సానిటరీ ఫాడ్స్ బాలికలకు అందజేత

**తెలంగాణ :** కల్లూరు మున్సిపాలిటీ, స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఈ రోజు లిఆలంబనా ఫౌండేషన్, ఆశ్రయ ఫౌండేషన్ , స్ఫూర్తి ఫౌండేషన్ ల సహకారంతో స్ఫూర్తి ఫౌండేషన్ కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ ఉయ్యూరీ శ్రీవ్యాల్ తొడ్పాటుతో ఫౌండేషన్ సభ్యులు వరకా రామారావు సుదూరం నుండి ఇబ్బంది పడుతూ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు (బాలికలకు) లి25 సైకిళ్లను (1,65,450), మరియు రీయుసేబుల్ సానిటరీ ఫాడ్స్ (1,50,000) మొత్తం 3,15,450 విలువ చేసే సామాగ్రి పాఠశాలకు జాతీయ బాలిక దినోత్సవ రోజున వితరణ చేయడం జరిగింది. మరియు 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన (టాప్-5) విద్యార్థులకు ఇంటర్లో డేస్ స్కాలర్ ఐదుగురుకి ఫీజు కట్టి చదివిస్తామని స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు వరకా రామారావు హామీ ఇచ్చారు. ఈ యొక్క కార్యక్రమానికి కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ ఐపీఎస్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. చదువుకొని గొప్ప స్థానంలో ఉన్న వ్యక్తికీ సమాజంలో ఎంతో విలువ ఉంటుంది, కనుక బాలికలు కష్టపడి చదువుకోవాలని, ప్రస్తుతం దేశ భవిష్యత్ ను మార్చాగల శక్తి ఒక విద్య ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందని, తద్వారా మీ తల్లిదండ్రులకు, సమాజానికి, మీరు చదివిన పాఠశాలకు, సైకిళ్ళు అందించిన ఈ ఫౌండేషన్ ధాతలకు మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల హెడ్మాస్టర్ పి.పద్మ, మాట్లాడుతూ.. మా పాఠశాల విద్యార్థులకు ఇంతటి గొప్ప సహాయాన్ని అందించిన ధాతలు ఆశ్రయ ఫౌండేషన్, ఆలంబనా ఫౌండేషన్, మరియు స్ఫూర్తి ఫౌండేషన్ వారికి మా పాఠశాల తరుపున, విద్యార్థుల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,



ఫౌండేషన్ వాలంటీర్లు, ఉబ్బన బాబు రావు, జల్ది రామకృష్ణ, వేము దినకర్, కొత్తపల్లి వెంకట ేశ్వర్లు, గంపల శ్రీను, మర్రెల వెంకటేశ్వరావు, ముజీమ్ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ భావన ఋషి-భద్రావతి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం

## శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు.

## కళ్యాణ కర్తలుగా దేవస్థాన కమిటీ అధ్యక్షులు బడుగు జయప్రకాష్,ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహ.



**తెలంగాణ :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో స్వామి వారి 40వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రథసప్తమి పర్వదిన సందర్భంగా శ్రీ భావన ఋషి-బద్రావతి దేవి కళ్యాణోత్సవ కార్యక్రమం వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణతో దేవస్థాన కమిటీ అధ్యక్షులు బడుగు జయప్రకాష్ మరియు ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహ కళ్యాణ కర్తలుగా వ్యవహరించగా దేవస్థానం కార్యవర్గము,దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో శాశ్వత సభ్యులు,ఆర్థికంగా వస్తురూపేనా సహకరించిన దాతల సమక్షంలో కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్థికంగా వస్తురూపేన సహకరించిన దాతలకు,సౌజన్య మూర్తులకు స్వామివారి శేష వస్త్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యవర్గం దేవస్థాన ధర్మకర్తలు మరియు వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణ కార్యక్రమాన్ని కనులారా వీక్షించి స్వామి వారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం అధ్యక్షులుబడుగు జయప్రకాష్,ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహ,ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్,గోశిక బాలాజీ,సహాయ కార్యదర్శి గోలి శ్రీనివాస్,గోశిక చంద్రకళ నరసింహ,కోశాధికారి బడుగు సుజాత నర్సింహ,సాంస్కృతిక కార్యదర్శి బడుగు క్రాంతి కుమార్,ప్రచార కార్యదర్శి కర్నాటి జనార్ధన్, సమన్వయ కార్యదర్శులు గుర్రం సంతోష్ కుమార్,బాల్యం అనిల్ కుమార్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు కందగట్ల బిక్షపతి,బడుగు లక్ష్మయ్య,చిక్క నరసింహ,గోశిక అంజయ్య,బడుగు శ్రీరాములు,గోశిక విఠలేశ్వర్,గుర్రం వెంకటేశం,గోశిక స్వామి,వనం ధనుంజయ,గుర్రం పాండురంగ,గోశిక నరసింహతో పాటుగా దేవాలయ ప్రధాన అర్చకులు గంజి నరసింహులు,బృహ





శర్మ,తదితరులు పాల్గొన్నారు.

# రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబోయే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**తెలంగాణ :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చాకలి ఐలమ్మ నగర్ లో రూ.60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించబోయే బ్రిడ్జి నిర్మాణ పనులకు పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపాయం మాట్లాడుతూ,ఈ బ్రిడ్జి నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు పూర్తిగా తొలగి మణుగూరు ప్రాంత అభివృద్ధికి ఇది కీలకంగా నిలుస్తుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి కట్టుబాటుతో పనిచేస్తుందని



పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు ఏఈ సత్య, డీఈ శ్రీనివాస్ వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ సానిటరీ రత్నాకర్ ,నరేందర్ మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ ,టౌన్ అధ్యక్షులు శివ సైదులు ,మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా ,సమితిసింగారం మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్ ,వార్డు సభ్యులు మాదాడి రాజేష్, కొలపిన్ని మానస కృష్ణవేణి 12 టైర్ యూనియన్ సెక్రెటరీ సురేందర్ రెడ్డి,బొగ్గు ముఠా అధ్యక్షులు నీరుడు రాంబాబు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలమూరి రాజు జీవి, చింతల కృష్ణ , పాతూరి వెంకన్న ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బానోతు లక్ష్మణ్ కురం రవి రామ్ రెడ్డి ఆది లక్ష్మి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,జన్మదిన వేడుకలు

## భద్రాచలం సరోజిని వృద్ధాశ్ర మంలో





**తెలంగాణ :** భద్రాచలంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులు మధ్యన,ఆదివారం నాడు ఘనంగా, భద్రాచలం నియోజకవర్గం శాసనసభ్యులు డా,తెల్లం వెంకట్రావు, జన్మదిన వేడుకలు, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో,భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దొడ్డిపట్ల కోటేష్, నేతృత్వంలో భద్రాచలంలోని సరోజినీ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పెద్దలు, వృద్యాపంలో ఉన్న అందరి మధ్యలో భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు,చేతుల మీదుగా నాయకులు,కార్యకర్తలందరూ కేకును కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపి ఆయనకు కేకు తినిపించారు. ఈ సందర్భంగా అక్కడున్న ప్రముఖ నాయకులు ఎమ్మెల్యే,జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి అక్కడున్నటువంటి.వృద్ధాప్యంలో ఉన్న పెద్దవారి యొక్క ఆశీర్వాదాలు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, తీసుకున్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులందరికీ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం,చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ,ప్రజా సేవలో భాగంగా తాను భద్రాచలం పట్టణ కేంద్రంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ, అనేక కార్యక్రమాలకు వెళుతూ ఉంటాననని,కానీ వృద్ధాశ్రమంలో ఇంతమంది పెద్దలు వృద్ధాప్యంలో వయసు ఉన్న పెద్దవారి మధ్యలో నా జన్మదిన వేడుకలు, జరుపుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉందని అని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, అన్నారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతరేల రవికుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బలుసు నాగ సతీష్,10వ వార్డు మెంబర్ నిట్టా రాజు,ఎన్.ఎస్.యు.ఐ డివిజన్ అధ్యక్షులు సరేళ్ళ వెంకటేష్,యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు ఎడారి ప్రదీప్,ఆర్జి సోషల్ మీడియా డివిజన్ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్, ఓ.బి.సి.సెల్ అధ్యక్షులు సూరంపూడి రాంప్రసాద్, మాగాపు రాజు, యూత్ కాంగ్రెస్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ గాడి విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమవరపు వెంకటరెడ్డి,యూత్ నాయకులు కుందవరపు శ్యామ్ కుమార్, మాచినేని భాను,గొడుగు సాయి,అరవింద్,అంబటి నాగరాజు,సాయి,బీట్ల శ్రీనివాస్, శ్రీను, మల్లీ తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 26,గణతంత్ర దినోత్సవం జెండా ఆవిష్కరణ వద్ద డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఫోటో పెట్టాలి

## మాల జన సమితి అధ్యక్షులు చెట్టి సురేష్



**తెలంగాణ :** అశ్వాపురం మండల కేంద్రంలో కాలవ బజార్ నందు మల్లేష్ గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో, మాల జన సమితి నాయకులు మాట్లాడుతూ, సోమవారం నాడు జరగనున్న జనవరి 26,77 వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరూ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలని మాల జన సమితి పినపాక నియోజకవర్గం అధ్యక్షులు చెట్టి సురేష్ విజ్ఞప్తి చేశారు.భారత రాజ్యాంగాన్ని 1950 జనవరి 26 న అధికారికంగా ప్రకటించడం జరిగిందని. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత మూలకర్త అయినటువంటి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని మనమందరం స్మరించుకోవడం ఎంతో అభినందనీయమని. మనందరి బాధ్యత అని ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కాలేజీలలో గాని అలాగే గ్రామ పంచాయతీల కార్యాలయాల వద్ద జరుపుకునే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరు రాజ్యాంగ నిర్మాత. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టుకోవాలని. కోరారు. మన వంతు గౌరవాన్ని ఆయనకు ఇవ్వాలని అన్నారు. రాబోయే తరాలు యువతీ యువకులకు అందరికీ కూడా భారత రాజ్యాంగం ఎలా నిర్మించారు, దానిని ఎలా ఆమోదపరిచారు తెలియజేసే విధంగా ప్రతి ఒక్కరు వివరించాలని అన్నారు. మరియు భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంచాలని దీనికోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల మాల జన సమితి నాయకులు చెట్టి మల్లేష్ జూపల్లి ధ్రువ కుమార్ మనోజ్ కుమార్ బత్తుల కిరణ్ ఏనోష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి అభ్యర్థిగా గెలుపొందిన రెండో వార్డ్ మెంబర్ సరితను ఘనంగా సన్మానించిన

## బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**తెలంగాణ :** భారతీయ జనతా పార్టీ కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో అశ్వాపురం మండలం లోని రామచంద్రపురం గ్రామపంచాయతీ రెండవ వార్డు బిజెపి అభ్యర్థినిగా గెలుపొందిన పగడాల సరితను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ కార్యక్రమంలో మహబూబాద్ పార్లమెంట్ కన్వీనర్ బిజెపి రాష్ట్ర నాయకులు ముస్కు శ్రీనివాసరెడ్డి బిజెపి పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి పోడియం బాలరాజు, బిజెపి నాయకులు పున్నం బిక్షపతి ముక్కెర కోటేశ్వరి పగడాల కృష్ణారెడ్డి సోమ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం





**తెలంగాణ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వలిగొండ పట్టణానికి చెందిన పార్టీ 4వ వార్డు మెంబర్ బల్గురి నరేష్ రెడ్డితల్లి కొద్ది రోజుల క్రితం మరణించారు దశదినకర్మలో పాల్గొని వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**తెలంగాణ :** మణుగూరు పట్టణ కేంద్రంలో నిర్వహించిన నా భారత్ నా ఓటు భారత ప్రజాస్వామ్య హృదయంలో పౌరుడు" అనే థీమ్‌తో 16 వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం మణుగూరు మండలం అంబేద్కర్ సెంటర్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపి ర్యాలీలో పాల్గొని, ప్రజలను చైతన్యపరుస్తూ అంబేద్కర్ సెంటర్ వరకు చేరుకొని అక్కడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ ద్వారా ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతగావినియోగించుకోవాలని ఎమ్మెల్యే పాయం పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్వో నరేష్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు ఎంపీఓ వెంకటేశ్వరరావు బిటి రామారావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు శివ సైదులు మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఐతనబోయిన సతీష్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిరియాల చైతన్య నాయుడు అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చౌటుప్పల్ మండల కేంద్రంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం

## విద్యా,రెవిన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఓటర్లచే ప్రతిజ్ఞ.

## కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లకు,80 సంవత్సరాలు వయసు పై పడిన ఓటర్ కు ప్రత్యేక సన్మానం.




**తెలంగాణ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో జాతీయ ఎన్నికల కమిషనర్ సూచనల మేరకు 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం-2026లో భాగంగా ఓటర్లచే ప్రతిజ్ఞను మండల పరిధిలో గల కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో పాటు స్థానిక మండల విద్యాధికారి గురవారావు,మండల నాయబ్ తహశీల్దార్ పి.సిద్ధార్థ కుమార్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కే.సుధాకర్ రావు,రెవెన్యూ సిబ్బంది మరియు స్థానిక బూత్ లెవెల్ అధికారులు వలిగొండ రోడ్ వరకు ర్యాలీలో పాల్గొని,విద్యార్థులతో పాటు ప్రతిజ్ఞ చేసి,కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లను,80 వయసు మీద ఉన్న ఓటరుకు చిరు సన్మానం చేసి ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు.



# సర్కారు బడులు నింపేలా ముందడుగు

## ఫిబ్రవరి 1 నుంచి ఇంటింటికీ టీచర్లు

## విద్యార్థులను సర్కారు బడులకు తీసుకొచ్చేందుకు గురువుల సంకల్పం

## 'ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం' పేరిట కార్యక్రమం



విశాలమైన తరగతి గదులు. ఆకట్టుకునే ఆట స్థలాలు. అపార అనుభవం, అంకితభావం కలిగిన గురువులు.! వీటన్నింటికీ మించి పైసా ఖర్చు లేకుండానే దొరికే ఉత్తమ విద్య. ఇవీ రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల ప్రత్యేకతలు.! రాష్ట్రాన్ని ఏలుతున్న రాజకీయ నాయకుల నుంచి ఐఏఎస్‌ల వరకు చాలా మంది ఇక్కడ చదువుకున్నవారే.! ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన బడులు గత వైఎస్సార్సీపీ పాలకుల అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతున్నాయి. దీంతో ప్రైవేటు స్కూల్స్ బాట పట్టిన పిల్లలను తిరిగి సర్కారు బడులకు తీసుకొచ్చేందుకు గురువులు నడుం బిగించారు. ఓ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.ఐదేళ్లూ అనేక రంగాలను నాశనం చేసిన వైఎస్సార్సీపీ సర్కార్ పిల్లల జీవితాలతోనూ ఆడుకుంది. టీచర్లకు సరైన శిక్షణ ఇవ్వకుండానే అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. 5 ఏళ్లలో కనీసం ఒక్క ఉపాధ్యాయ పోస్టును సైతం భర్తీ చేయలేదు. నిరంకుశంగా బడుల వీలినం చేపట్టింది.దీంతో వైఎస్సార్సీపీ హయాంలో పిల్లలు కొంతమంది ప్రైవేటు వైపు మళ్లగా మరికొందరు స్తోమత లేక బడి మానేశారు. కూటమి సర్కార్ రాగానే సమస్యలను చాలా వరకు చక్కదిద్దింది. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేసింది. ప్రాథమికోన్నత, హైస్కూల్ ప్లస్ విధానాలు రద్దు చేసింది. అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ఇప్పుడు విద్యార్థులను ప్రభుత్వ బడులకు తిరిగి తీసుకొచ్చేందుకు గురువులు నడుం బిగించారు. "ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం" నినాదంతో ఓ కార్యక్రమం చేపట్టాలని సంకల్పించారు."మొత్తం పాఠశాలలు అన్నింటిని సర్వాంగ సుదరంగా తీర్చిదిద్దారు. స్కూల్లో మధ్యాహ్న భోజనం అద్భుతంగా ఉంది. పిల్లలకు అవసరమైన పుస్తకాలు, షూస్ మొదలైనవి విద్యార్థులకు అందిస్తున్నారు. ఈరోజు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వాళ్లల్లో 90 శాతం మంది గవర్నమెంట్ స్కూల్‌లో చదివిన వాళ్లమే. కావున ప్రభుత్వ బడిని బలోపేతం చేసేందుకు మేం కచ్చితంగా కృషి చేస్తాం. పాఠశాలకు అదనంగా గంట సమయం కేటాయిస్తాం. పిల్లలకు నైతిక విద్య నేర్పుతాం. ప్రస్తుత రోజుల్లో గంజాయికి అలవాటు పడుతున్నా పిల్లలు ఉన్నారు. బాధ్యతయుతా పౌరులుగా వారిని తీర్చిదిద్దుతాం. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నాం." - ఎన్.వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ అధ్యక్షుడుఫిబ్రవరి 1 నుంచి నెలాఖరు వరకు లక్షా 85 వేల మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. రోజూ విధుల్లో పాల్గొంటూనే, విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే ఉదయం సాయంత్రం వేళల్లో ఇంటింటి ప్రచారం చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఓ పోస్టర్‌ను రూపొందించి దాని ద్వారా ప్రభుత్వ బడుల గొప్పతనాన్ని తల్లిదండ్రులకు వివరించనున్నారు. ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్చాలని కోరనున్నారు. ముందుకొచ్చే ప్రజాప్రతినిధులు, సమాజ సేవకులను కలుపుకుని ప్రచారం చేయనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నేతలు తెలిపారు. గురువులు చేపట్టిన ఈ సంకల్పానికి ప్రభుత్వం కూడా అన్ని విధాల సహకారం అందిస్తూ, వారిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకుటుంది. "అవసరమైతే మనమే ఒక గంట అదనంగా పనిచేద్దాం. మన దగ్గర చదివే పిల్లలకు చదవడం, రాయడం, మాట్లాడడం, తెలుగుతో పాటు ఆంగ్లం భాషలోనూ మాట్లాడే సామర్థ్యం ఉంది. ఉపాధ్యాయులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. ఒక అంశంపై విద్యార్థులకు అవగాహన రావాలి అంటే ఉపాధ్యాయుడు వివరించి బోధించాలి. ఆ పని కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే జరుగుతుంది. మిగతా స్కూల్లో కేవలం ఎగ్జామ్స్ కోసమే బోధనా జరుగుతుంది.'

# బట్టతల వచ్చిందని భార్యకు విడాకులు

## 16 ఏళ్ల బంధానికి భర్త గుడ్‌బై

## చైనాలో దారుణం.. బట్టతల వచ్చిందని భార్యకు విడాకులు

## చర్మవ్యాధి కారణంగా జుట్టు కోల్పోయిన మహిళ

## చికిత్సకు నిరాకరించి, మానసికంగా వేధించిన భర్త

## బిడ్డ కస్టడీని కూడా దక్కకుండా చేసిన భర్తపై విమర్శలు



చైనాలో ఓ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. భార్యకు అనారోగ్యం కారణంగా బట్టతల రావడంతో ఓ భర్త ఆమెకు విడాకులిచ్చాడు. 16 ఏళ్ల వివాహ బంధాన్ని అర్థాంతరంగా తెంచేసుకున్నాడు. ఈ అమానవీయ ఘటన చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకోగా సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీసింది.

**అసలేం జరిగిందంటే..!**

హెనాన్ ప్రావిన్స్‌కు చెందిన లీ (36) అనే మహిళకు 16 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి కుటుంబమే లోకంగా బతికింది. భర్త, పిల్లల కోసం అహర్నిశలు శ్రమించింది. అయితే, రెండేళ్ల క్రితం ఆమెకు 'విటిలిగో' అనే దీర్ఘకాలిక చర్మ వ్యాధి సోకింది. దీనివల్ల ఆమె జుట్టు తెల్లబడి, క్రమంగా ఊడిపోయి బట్టతల వచ్చింది.అనారోగ్యంతో బాధపడుతున్న భార్యకు అండగా నిలవాల్సిన భర్త.. ఆమెను అసహ్యించుకోవడం మొదలుపెట్టాడు. కనీసం ఆసుపత్రికి తీసుకెళ్లడం గానీ, ఆరోగ్యం గురించి అడగడం గానీ చేయలేదు. తన పరువు పోతుందని భావించి శుభకార్యాలకు కూడా ఆమెను దూరం పెట్టాడు. చికిత్సకు అయ్యే ఖర్చు భరించడం ఇష్టంలేక ఆమెను మానసికంగా వేధించడం ప్రారంభించాడు.భర్త నిర్లక్ష్యం, నిత్యం గొడవలతో లీ మానసికంగా కుంగిపోయింది. ఈ ఒత్తిడి కారణంగా ఆమె వ్యాధి మరింత తీవ్రమైందని వైద్యులు తెలిపారు. చివరికి, ఆమె భర్త విడాకులు కోరగా, లీ అంగీకరించక తప్పలేదు. కోర్టు కూడా బిడ్డ కస్టడీని భర్తకే అప్పగించడంతో ఆమె ఒంటరైపోయింది. "అతనిలాంటి కఠిన హృదయుడిని నేనెక్కడా చూడలేదు" అని లీ కన్నీరుమున్నీరైంది. ప్రస్తుతం ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ఆ భర్త తీరుపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఆదమరిస్తే ఫోన్ పోయినట్లే

## నగరంలో పెరుగుతున్న సెల్‌ఫోన్ చోరీలు

## చెలరేగిపోతున్న సెల్‌ఫోన్ చోరీ ముఠాలు

## రద్దీ ప్రాంతాల్లో చాకచక్యంగా ఫోన్లు కొట్టేస్తున్న కేటుగాళ్లు

## బస్టాండ్లు, రైతు బజార్లు, మార్కెట్లు, రైల్వేస్టేషన్లలో చేతివాటం

## బాధితులకు తిరిగి సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న పోలీసులు



స్మార్ట్‌ఫోన్ మనకో మంత్రదండం. అన్నింటికీ బ్రహ్మాస్త్రం. ఏ పని చేయాలన్నా ఫోన్ లేనిదే రోజు గడవదు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఫోన్‌లే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. బస్టాండ్లు, రైతు బజార్లు, రైల్వేస్టేషన్లలో కేటుగాళ్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏ మాత్రం అనుమానం రాకుండా పని పూర్తి చేసుకుని ఉడాయిస్తున్నారు. మరి ఇలాంటి కేటుగాళ్లకు పోలీసులు ఎలా చెక్ పెడుతున్నారు? మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?

**ప్రతిరోజూ 10 నుంచి 15 కేసులు :** సెల్‌ఫోన్ చేతిలో ఉంటే సమస్తం మన దగ్గర ఉన్నట్లే. ఎటువంటి సమాచారం అయినా క్షణాల్లో తెలుసుకోవచ్చు. ప్రధానంగా ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలు సులభంగా చేసుకోవచ్చు. నగదు చెల్లింపుల దగ్గర నుంచి ప్రతి ఒక్కటీ ఫోన్ ద్వారానే జరిగిపోతున్నాయి. మరి అటువంటి సెల్‌ఫోన్ చోరీకి గురైతే కోలుకోలేని దెబ్బే. నగరమేదైనా ప్రస్తుతం సెల్‌ఫోన్ల చోరీ సాధారణంగా మారిపోయింది. ప్రతిరోజూ ఒక్కో ఠాణా పరిధిలో 10 నుంచి 15 ఫోన్లు దొంగతనానికి గురవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు."అందరి దగ్గర డబ్బులు, పర్సులు ఉంటాయో లేదో తెలీదు కానీ సెల్‌ఫోన్లు మాత్రం కచ్చితంగా ఉంటాయి. ఒక్క ఫోన్ దొంగతనం చేసినా రూ.2 వేల అయితే వస్తాయి. అందుకే విపరీతంగా దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసులు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో ఈ చోరీలు జరుగుతున్నాయి. రద్దీ ఉన్న ప్రదేశాల్లో ఒకరిని ఒకరు తోసుకుంటూ చాలా తేలికగా దొంగతనాలు చేస్తున్నారు.

**రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధికంగా :** ప్రధానంగా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను కొందరు కేటుగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుని చోరీలకు తెగబడుతున్నారు. ఎక్కువగా అంతర్రాష్ట్ర ముఠాలు చరవాణులు అపహరిస్తున్నట్టు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. నలుగురు నుంచి ఆరుగురు ముఠాగా ఏర్పడి రద్దీ ఉండే బస్టాండ్లను ఎంచుకుని చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తేల్చారు. బస్సులు ఎక్కే, దిగే క్రమంలో తాపీగా పని పూర్తి చేస్తున్నారు.

**ఈ ప్రదేశాల్లో ఎక్కువగా :** ముఠా సభ్యులందరూ ప్రాంతాల వారీగా ప్రయాణిస్తూ సెల్‌ఫోన్లు అపహరిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ చోరీ ముఠాలు రెచ్చిపోతున్నాయి. అదును చూసి ఫోన్లను దొంగిలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో దొంగిలించిన ఫోన్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు కొల్లగొడుతున్నారు. బాధితులు తమ బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేసేలోపు కేటుగాళ్లు సొమ్ము స్వాహా చేస్తున్నారు. దీంతో బాధితుల జేబులు గుల్లవుతున్నాయి."దొంగతనం చేసిన ఫోన్లను కొనడం, అమ్మడం రెండూ నేరాలుగా పరిగణిస్తాం. సరైన బిల్లు లేకుండా సెల్‌ఫోన్ కొనకూడదు. ఇటువంటి పనులు చేసి దొరికిన వారిని కఠినంగా శిక్షిస్తాం." - గుణశేఖర్, మల్కాజిగిరి నేర విభాగం డీసీపీ

**బిల్లు లేకుండా సెల్‌ఫోన్లు కొనవద్దు :** జేబులో ఉండే ఫోన్ పోయిందని గుర్తించిన సదరు యజమాని పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఫోన్‌కు సంబంధించిన బిల్లు, ఎక్కడ కొన్నారు వంటి రసీదులన్నీ ఫిర్యాదుదారుడు పోలీసులకు సమర్పించాల్సి ఉంటుంది. బిల్లు లేకుండా సెల్‌ఫోన్లు కొనవద్దని పోలీసులు సూచిస్తున్నారు. సెల్‌ఫోన్ చోరీకి గురైన సందర్భాల్లో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుల వల్ల చాలాసార్లు ఉపయోగం ఉంటోంది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చోరీ అయిన ఫోన్లను గుర్తిస్తున్న పోలీసులు, తిరిగి బాధితులకు అప్పగిస్తున్నారు. సెల్‌ఫోన్ల అపహరణను అరికట్టాలంటున్న బాధితులు ఈ తరహా ముఠాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. సెల్‌ఫోన్లు అపహరించే ముఠాలను పట్టుకోవడానికి పోలీసులు మరిన్ని పటిష్ట చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# యాచారంలో కారు బీభత్సం.. ఎస్సైని బ్యానెట్‌పై అర కిలోమీటర్ ఈడ్చుకెళ్లాడు!

## డ్రంకెన్ డ్రైవ్ నుంచి తప్పించుకునేందుకు కారుతో యువకుడి బీభత్సం

## ఎస్సైని ఢీకొట్టి బ్యానెట్‌పై అర కిలోమీటర్ ఈడ్చుకెళ్లిన వైనం

## ఈ క్రమంలో ఓ బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలు

## పరారైన నిందితులను ఇబ్రహీంపట్నం వద్ద పట్టుకున్న పోలీసులు



రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కారు బీభత్సం సృష్టించింది. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు ఓ యువకుడు తన కారుతో ఎస్సైని ఢీకొట్టి, దాదాపు అర కిలోమీటర్ దూరం బ్యానెట్‌పైనే ఈడ్చుకెళ్లాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. యాచారం బస్టాండ్ వద్ద పోలీసులు ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో వేగంగా వస్తున్న కారును ఆపాలని పోలీసులు చూశారు. డ్రైవర్ కారును ఆపకపోవడంతో ఎస్సై మధు వాహనానికి అడ్డంగా నిలబడ్డారు. అయినా ఆగకుండా డ్రైవర్ కారుతో ఎస్సైని ఢీకొట్టడంతో ఆయన బ్యానెట్‌పై పడిపోయారు. అయినప్పటికీ నిందితుడు కారును ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు.ఈ క్రమంలోనే ఓ బైక్‌ను కూడా ఢీకొట్టడంతో వెంకట్ రెడ్డి, ఆయన కోడలు దివ్య, మనవడికి గాయాలయ్యాయి. దివ్య చేయి విరిగింది. యాచారం దాటిన తర్వాత కారు వేగం తగ్గడంతో ఎస్సై మధు బ్యానెట్‌పై నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు.యాచారం పోలీసుల సమాచారంతో ఇబ్రహీంపట్నం సమీపంలోని ఖానాపూర్ వద్ద పోలీసులు కారును అదుపులోకి తీసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. కారు నడిపిన వ్యక్తిని కోహెడకు చెందిన శ్రీకర్‌గా, పక్కన ఉన్న వ్యక్తిని హయత్‌నగర్‌కు చెందిన అతని స్నేహితుడు నితిన్‌గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కర్తవ్యపథ్‌లో ప్రత్యేక ఆకర్షణగా 'ఆపరేషన్ సిందూర్' శకటం

## పరేడ్‌లో ప్రదర్శించిన సైన్యం

## గణతంత్ర వేడుకల్లో ఆపరేషన్ సిందూర్ శకటం ప్రదర్శన

## పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత్ జరిపిన మెగా ఆపరేషన్ అది

## త్రివిధ దళాల సంయుక్త పోరాట పటిమకు ప్రతీకగా శకటం

## పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈ ఆపరేషన్




77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన పరేడ్‌లో త్రివిధ దళాల శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన భారీ సైనిక చర్య 'ఆపరేషన్ సిందూర్'ను ఈ శకటం ద్వారా ప్రదర్శించారు. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేనల సంయుక్త పోరాట శక్తికి, ఐక్యతకు ఇది ప్రతీకగా నిలిచింది.'సంయుక్త పోరాటంతో విజయం' అనే థీమ్‌తో ఈ శకటాన్ని రూపొందించారు. యుద్ధ సమయంలో ప్రణాళిక, సమన్వయంతో నిర్ణయాత్మక చర్యలు తీసుకునే భారత సంకల్పాన్ని ఇది చాటిచెప్పింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత వాయుసేన జరిపిన వైమానిక దాడులు, సముద్రంలో ఆధిపత్యాన్ని నిలబెట్టిన నౌకాదళం వేగవంతమైన విన్యాసాలు, సైన్యం సాగించిన భూతల దాడులను శకటంలో కళ్లకు కట్టినట్లు చూపించారు.గతేడాది పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టారు. మే 7న తెల్లవారుజామున పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై దాడులతో ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు సాగిన ఈ సైనిక చర్యలో పాకిస్థాన్.. భారత నగరాలపై క్షిపణి దాడులకు విఫలయత్నం చేయగా, వాటిని భారత వాయు రక్షణ వ్యవస్థ సమర్థంగా నిర్వీర్యం చేసింది.ఈ ఆపరేషన్‌లో భారీ నష్టాలను చవిచూసిన పాకిస్థాన్, ఇక తట్టుకోలేక కాల్పుల విరమణ చేయాలని అభ్యర్థించింది. దీంతో మే 10న ఆపరేషన్ నిలిచిపోయింది. భవిష్యత్ సవాళ్లకు సిద్ధంగా, సాంకేతికతతో కూడిన శక్తిగా భారత రక్షణ దళాలు రూపాంతరం చెందుతున్నాయని ఈ శకటం స్పష్టం చేసింది.

# గణతంత్ర వేడుకల వేళ తప్పిన పెను ప్రమాదం

## రాజస్థాన్‌లో 10 వేల కిలోల పేలుడు పదార్థాల సీజ్!

## నాగౌర్ జిల్లా హర్సౌర్ గ్రామంలో 9,550 కిలోల అమ్మోనియం నైట్రేట్ స్వాధీనం

## 2025 నవంబర్‌లో ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడులో వాడిన కెమికల్ ఇదేనని గుర్తింపు

## పాత నేరస్తుడు సులేమాన్ ఖాన్ అరెస్ట్, రంగంలోకి కేంద్ర దర్యాప్తు సంస్థలు



గణతంత్ర దినోత్సవానికి కొన్ని గంటల ముందు రాజస్థాన్ పోలీసులు ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. నాగౌర్ జిల్లాలోని ఒక వ్యవసాయ క్షేత్రంపై శనివారం అర్ధరాత్రి మెరుపు దాడి చేసిన పోలీసులు పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. 187 గోనె సంచుల్లో నింపిన 9,550 కిలోల 'అమ్మోనియం నైట్రేట్'ను చూసి అధికారులు సైతం విస్తుపోయారు.గతేడాది నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన పేలుడులో 15 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో ఉగ్రవాదులు వాడింది కూడా ఇదే అమ్మోనియం నైట్రేట్ కావడం ఆందోళన కలిగిస్తోంది. తాజా దాడుల్లో కేవలం కెమికల్ మాత్రమే కాకుండా, భారీ సంఖ్యలో డిటోనేటర్లు, ఫ్యూజ్ వైర్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో సులేమాన్ ఖాన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడికి మైనింగ్ ముఠాలతో సంబంధాలు ఉన్నాయని ప్రాథమికంగా గుర్తించారు. చట్టవిరుద్ధమైన మైనింగ్ కోసం ఈ పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు నిందితుడు చెబుతున్నప్పటికీ, గణతంత్ర దినోత్సవానికి ముందే ఇంత పెద్ద ఎత్తున నిల్వ చేయడం వెనుక భారీ కుట్ర ఏదైనా ఉందా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.ఈ ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు నాగౌర్ పోలీసులు సమాచారం అందించారు. ఢిల్లీలో జరిగిన పాత పేలుడు ఘటనలతో ఈ నిందితుడికి ఏవైనా లింకులు ఉన్నాయా? అనే దానిపై కేంద్ర సంస్థలు సులేమాన్ ఖాన్‌ను ప్రశ్నించనున్నాయి. రిపబ్లిక్ డే వేడుకల నేపథ్యంలో రాజస్థాన్‌తోపాటు ఢిల్లీ సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# కోడలిపై ఇలా రివెంజ్ తీర్చుకున్న అత్తగారు!

## తాగు బోతు భర్తను మంచానికి కట్టేసిన మహిళ

## ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్ జిల్లాలో ఘటన

## కోడలు సోనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అత్త

## భర్తే వేధింపులకు గురి చేస్తున్నాడన్న సోని

## సోషల్ మీడియాలో ఫోటో, వీడియో వైరల్



ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలీఘర్ జిల్లాలో ఒక విచిత్రమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఒక తాగుబోతు భర్తకు భార్య షాక్ ఇవ్వగా, కోడలిపై అత్త పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.పూర్తి వివరాల్లోకి వెళితే, హమీద్‌పూర్ గ్రామానికి చెందిన ప్రదీప్ అనే వ్యక్తి నిత్యం మద్యం సేవించి భార్య సోనిని వేధింపులకు గురిచేసేవాడు. అతని వేధింపులు భరించలేక, ఒకరోజు సోని తన భర్తను మంచానికి కట్టివేసింది. ఈ విషయం తెలుసుకున్న ప్రదీప్ తల్లి, కోడలు తన కొడుకును మంచానికి కట్టేయడాన్ని జీర్ణించుకోలేకపోయింది. దీంతో ఆమె కోడలిపై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంది. గతంలో సోని తుపాకీతో ఉన్న కొన్ని ఫోటోలు, వీడియోలను తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, కోడలు తన కొడుకును తుపాకీతో బెదిరిస్తోందని ఫిర్యాదు చేసింది.అత్త ఫిర్యాదు మేరకు పోలీసులు సోని ఇంట్లో సోదాలు నిర్వహించగా, అక్కడ ఎలాంటి ఆయుధాలు లభించలేదు. మరోవైపు, భర్త వేధింపులపై సోని కూడా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త నిత్యం మద్యం సేవించి వేధింపులకు గురిచేస్తున్నాడని, అందుకే తాను అతన్ని మంచానికి కట్టేయాల్సి వచ్చిందని ఆమె పోలీసులకు తెలిపింది. ఇరువర్గాల ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.ప్రస్తుతం ఈ భార్యాభర్తల గొడవకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

## 'శంబాల'తోనే మంచి గుర్తింపు వచ్చిందంటున్న శివకార్తీక్

ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా యాక్టర్‌గా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించాలంటే చాలా కష్టాలు పడాలి. ఎన్ని కష్టాలు పడ్డా ఒక్కోసారి అవకాశం దొరుకుతుందనే భరోసా కూడా ఉండదు. సినీ ఇండస్ట్రీలో అవకాశాలు రావడం, వచ్చిన అవకాశాన్ని నిలబెట్టుకోవడం అంత సులభమైన విషయమేం కాదు. ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్తూ వచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ నటుడిగా తనను తాను నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్న వ్యక్తుల్లో ఒకడు శివ కార్తీక్. ఈ నటుడు కెరీర్‌లో చాలా సినిమాలు చేసినప్పటికీ ఆదిసాయికుమార్‌తో కలిసి నంటించిన శంబాల తనకు మంచి గుర్తింపునిచ్చిందని అంటున్నాడు.



## కొత్త సినిమా ప్రకటించిన నితిన్.. దర్శకుడు ఎవరంటే?

కొంతకాలంగా ట్రాక్ తప్పిన హీరో నితిన్ కొత్త సినిమా ప్రకటించాడు. దర్శకుడు విఐ ఆనంద్‌తో సినిమా చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇది నితిన్ కెరీర్‌లో 36వ సినిమాగా రాబోతోంది. ఈ మేరకు ఓ ఫోటో షేర్ చేశాడు. నో బాడీ నో రూల్స్.. వాస్తవ నిబంధనలు ఇప్పుడే మారిపోయాయి. నా సోదరులు దర్శకుడు ఆనంద్, నిర్మాత శ్రీనివాస్‌గారితో ప్రయాణం చేయడానికి ఆతృతగా ఎదురుచూస్తున్నాను అని రాసుకొచ్చాడు.

ఎల్లమ్మ చేజారె..

పోస్టర్‌లో నితిన్ సిగరెట్ తాగుతున్నట్లుగా చూపించారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి ఈ మూవీ నిర్మించనున్నాడు. నిజానికి నితిన్ బలగం వేణుతో ఎల్లమ్మ సినిమా చేయాల్సింది. కానీ, ఆ ప్రాజెక్టు అతడి నుంచి చేజారి దేవిశ్రీప్రసాద్‌ను వరించింది. ఏదేమైనా ఆనంద్ డైరెక్షన్‌లో నితిన్ హిట్టు కొడతాడేమో చూడాలి! వీఐ ఆనంద్.. హృదయం ఎక్కడున్నాది, టైగర్, ఎక్కడికి పోతావు చిన్నవాడ, ఒక్క క్షణం, డిస్కోరాజా, ఊరు పేర భైరవకోన వంటి సినిమాలు తెరకెక్కించాడు.





## వైట్ డ్రెస్‌లో క్యూట్ లుక్స్.. అందాలతో గత్తర లేపుతున్న రకుల్..



అందాల చిన్నది రకుల్ పెళ్లి తర్వాత గ్లామర్ డోస్ మరింత పెంచింది. సినిమాల పరంగా దూకుడుగా లేకపోయినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తన అంద చందాలతో అభిమానుల మనసు దోచుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ వైట్ డ్రెస్‌లో క్యూట్ లుక్స్‌తో ప్రతి ఒక్కరి మనసు దోచేస్తుంది. ఇక ఈ బ్యూటీకి ఈ మూవీ తర్వాత విపరీతమైన పాపులారిటీ రావడంతో వరసగా టాలీవుడ్ స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకొని, స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటింది. తెలుగులో చాలా మంది స్టార్ హీరోల సరసన నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో తెలుగు అభిమానుల మనసు దోచుకొని, తన కంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. ప్రతి ఒక్కరినీ తన గ్లామర్‌తో కట్టి పడేసింది. కానీ అనుకోకుండా తెలుగు ఇండస్ట్రీకి దూరమైంది అనే చెప్పాలి ఈ బ్యూటీ. కెరీర్ మంచి స్టేజ్‌లో ఉండగానే బాలీవుడ్ చెక్కేసింది ఈ బ్యూటీ. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గాయి. అక్కడ కొన్ని రోజుల పాటు వరసగా సినిమాలు చేసి మంచి గుర్తింపు సంపాదించుకుంది ఈ చిన్నది. తర్వాత బాలీవుడ్ నిర్మాతను ప్రేమించి, గోవాలో ఘనంగా వివాహం చేసుకుంది. ఇక ఈ ముద్దుగుమ్మకు వివాహం తర్వాత ఎక్కువగా అవకాశాలు రాకపోవడంతో, బిజినెస్‌లపై ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చిన్న దానికి బ్యాడ్ టైం నడుస్తోంది. వరస సినిమాలతో హిట్స్ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం చేతిలో అవకాశాలు లేకపోయాయి. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ తాజాగా వైట్ కలర్ డ్రెస్‌లో ఉన్న ఫొటోస్ షేర్ చేసింది. ఇవ అభిమానులను తెగ ఆకట్టుకుంటున్నాయి.

## మాస్ రాజా ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ రిపబ్లిక్ డే రోజున ఆర్77 సర్ ప్రైజ్!




మాస్ మహారాజా రవితేజ, క్లాస్ సినిమాల దర్శకుడు శివ నిర్వాణ క్రేజీ కాంబినేషన్‌లో సరికొత్త చిత్రం పట్టాలెక్కడానికి సిద్ధమైంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామాకు ఆర్77 అనే వర్కింగ్ టైటిల్ పెట్టారు మేకర్స్. రిపబ్లిక్ డే కానుకగా సోమవారం ఉదయం 10 గంటలకు ఈ సినిమా అధికారిక టైటిల్ మరియు ఫస్ట్ లుక్‌ను చిత్ర యూనిట్ ఘనంగా విడుదల చేయనుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి 'ఇరుముడి' అనే టైటిల్‌ను ఖరారు చేసే ఆలోచనలో ఉన్నట్లు టాలీవుడ్ సమాచారం. సాధారణంగా శివ నిర్వాణ సినిమాల్లో ఉండే సున్నితమైన ప్రేమకథల కంటే భిన్నంగా, ఇది ఒక పవర్‌ఫుల్ యాక్షన్ రివెంజ్ డ్రామాగా తెరకెక్కుతోంది. తన కూతురిని కాపాడుకోవడం కోసం ఒక తండ్రి చేసే పోరాటం, అతని విముక్తి ప్రయాణం చుట్టూ ఈ కథ నడవనుంది. ఇందులో రవితేజ సరసన హీరోయిన్‌గా ప్రియా భవాని శంకర్ నటిస్తుండగా, తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ స్వరాలు సమకూరుస్తున్నారు. 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి విజయాల తర్వాత 'ఖుషి'తో మిశ్రమ ఫలితాన్ని అందుకున్న శివ నిర్వాణ, ఈ సినిమాతో ఎలాగైనా భారీ హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నారు. సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాతో సందడి చేసిన రవితేజ, ఇప్పుడు ఈ సరికొత్త మాస్ అండ్ ఎమోషనల్ సబ్జెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



## పద్మ పురస్కారాలు.. నటకిరీటి రాజేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ

కేంద్రప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించింది. కేంద్రం ఐదుగురిని పద్మవిభూషణ్, 13 మందిని పద్మ భూషణ్, 113 మందిని పద్మశ్రీకి ఎంపిక చేసింది. తెలుగు రాష్ట్రాల నుంచి 11 మందికి పద్మ పురస్కారాలున్నాయి.

ఏపీకి చెందిన నలుగురు, తెలంగాణకు చెందిన ఏడుగురిని కేంద్రం పద్మ పురస్కారాలకు ఎంపిక చేసింది. సినీ రంగం నుంచి నటకిరీటీ రాజేంద్రప్రసాద్, మమ్ముట్టి, దివంగత బాలీవుడ్ యాక్టర్ ధర్మేంద్ర, మురళీమోహన్ పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిలో ఉన్నారు.

కళా విభాగంలో పద్మపురస్కారాలు ఇలా..

నటకిరీటి రాజేంద్రప్రసాద్‌కు (ఏపీ) -పద్మశ్రీ దీపికారెడ్డి (తెలంగాణ)- పద్మశ్రీ (కళారంగం)

మాగంటి మురళీమోహన్ (ఏపీ)-పద్మశ్రీ మలయాళ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్

దివంగత బాలీవుడ్ యాక్టర్ ధర్మేంద్ర -పద్మ విభూషణ్ తమిళ నటుడు ఆర్ మాధవన్- పద్మశ్రీ

# ఆర్బీఐలో ఉద్యోగాలు.. పదో తరగతి పాసైతే చాలు

**అంతకుమించితే అనర్హతే..!**

**అటెండెంట్ ఉద్యోగాలకు ప్రకటన జారీ చేసిన ఆర్బీఐ**

**మొత్తం 572 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్**

**ఆన్ లైన్ లో దరఖాస్తు.. ఫిబ్రవరి 24 గడువు**

పదో తరగతి పాసైన వారికి ప్రభుత్వ ఉద్యోగం పొందే అవకాశం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజాగా అటెండెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేసింది. మొత్తం 572 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు పదో తరగతిని అర్హతగా నిర్ణయించింది. పదో తరగతి పాసైన వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. కాగా, దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో ఉండడంతో ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ ఎక్కువగా ఉంటుందనే విషయం తెలిసిందే.పదో తరగతి కనీస అర్హత కలిగిన ఉద్యోగాలకూ పీజీ, పీహెచ్ డీ చేసిన అభ్యర్థులు పోటీపడుతుంటారు. దీంతో పదోతరగతితో చదువు ఆపేసిన వారికి ఆ ఉద్యోగం దొరికే అవకాశాలు తగ్గిపోతాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్బీఐ తాజా నోటిఫికేషన్ లో కీలకమైన షరతు విధించింది. అటెండెంట్ ఉద్యోగానికి పదో తరగతి పాస్ అయిన అభ్యర్థులు సరిపోతారని వివరిస్తూ.. ఉన్నత విద్యావంతులను ఈ పోస్టులకు అనర్హులుగా ప్రకటించింది. ఉన్నత విద్యార్హతలు ఈ పోస్టులకు అనర్హతగా పరిగణిస్తామని వెల్లడించింది.

**వయస్సు: 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాలు**




భాషా సామర్థ్యం: అభ్యర్థి దరఖాస్తు చేసుకునే రాష్ట్రం, రీజియన్ లకు చెందిన భాషలో స్పష్టంగా మాట్లాడగలగాలి. రాయడం, చదవడం వచ్చి ఉండాలి.

దరఖాస్తు రుసుము: ఆన్ లైన్ లో ఫిబ్రవరి 24 లోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుముగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికులు రూ.50 (జీఎస్టీ అదనం) చెల్లించాలి. ఇతరులు రూ.450 (జీఎస్టీ అదనం) ఆన్ లైన్ లో చెల్లించాలి.

# వ్యూహాత్మక వృద్ధి దిశగా భారత్ అడుగులు



ఆధునిక ఆర్థిక వ్యవస్థలో కేంద్ర బడ్జెట్ అంటే కేవలం అంకెల గారడీ కాదు.. అది దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక సమగ్ర విధాన పత్రం. 2026 బడ్జెట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు నెలకొన్నాయి. 2025లో చేపట్టిన కీలక కార్పొరేట్ సంస్కరణలను కొనసాగిస్తూనే అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా వ్యూహాత్మక మార్పులకు కేంద్రం సిద్ధమవుతోంది.

**సంస్కరణల కొనసాగింపు**

గత ఏడాది ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' (వ్యాపార నిర్వహణ సౌలభ్యం)లో భాగంగా అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చింది. సాంకేతిక ఇబ్బందులను అధిగమిస్తూ కార్పొరేట్ విధానాలను సరళీకరించేందుకు ఎంసీఏ వీ3 ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. డైరెక్టర్ల కేవైసీ ప్రక్రియను సులభతరం చేసింది. చిన్న కంపెనీలకు ఊతం ఇచ్చేలా వాటి విలీనాలు, ఇతర అనుబంధ సంస్థల విడదీత కోసం ఫాస్ట్‌ట్రాక్ విధానాన్ని విస్తరించింది. దాంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, టారిఫ్ వివాదాల మధ్య కూడా భారత్ స్థిరమైన విదేశీ పెట్టుబడులను (ఫ్డీఐ) ఆకర్షించగలిగింది. ఈ ఊపును 2026లోనూ కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**రక్షణ రంగంలో సడలింపులు?**

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ఈ బడ్జెట్‌లో రక్షణ రంగ విదేశీ పెట్టుబడుల పరిమితిని సవరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఐదో తరం యుద్ధ విమానాల తయారీ, కీలక విడిభాగాల ఉత్పత్తి కోసం పెట్టుబడులను పెంచడం ద్వారా గ్లోబల్ కంపెనీలను భారత్‌కు రప్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. పౌర, రక్షణ డ్రోన్ల తయారీలో చైనాపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు దేశీయ సరఫరా గొలుసును బలోపేతం చేసే ప్రకటనలు వెలువడవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

**సెమీకండక్టర్ మిషన్**

భవిష్యత్తు అవసరాలైన సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్ రంగాలకు ఈ బడ్జెట్ పెద్దపీట వేయనుంది. రీసైక్లింగ్ ద్వారా ఖనిజాలను పొందడంపై దృష్టి సారించేలా నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దేశీయ ఎకోసిస్టమ్‌ను నిర్మించే స్టార్టప్‌లకు ప్రత్యేక ప్రోత్సాహకాల అందించేందుకు సెమీకండక్టర్ మిషన్ తోడ్పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతీయ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సమగ్ర కృత్రిమ మేధ ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటును వేగవంతం చేస్తారని చెబుతున్నారు.

**వాణిజ్య ఒప్పందాలు**

2025-26 బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి సూచించినట్లుగా ఎగుమతుల వృద్ధికి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఫ్టీఏ) కీలకం కానున్నాయి. ప్రధాన దేశాలతో పెండింగ్‌లో ఉన్న ఒప్పందాలను ముగించడం ద్వారా భారతీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మార్గం సుగమం చేయడమే దీని లక్ష్యం.

**కార్పొరేట్ చట్టాల సరళీకరణ**

'కంపెనీస్ (సవరణ) బిల్లు-2025' ద్వారా కార్పొరేట్ నేరాల డీక్రిమినలైజేషన్ (శిక్షల తొలగింపు) దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. చిన్నపాటి సాంకేతిక లోపాలకు జైలు శిక్షల వంటివి తొలగించి జరిమానాలతో సరిపెట్టడం ద్వారా వ్యాపారవేత్తల్లో భరోసా కల్పించాలని చూస్తోంది. వీటితో పాటు స్టాంప్ డ్యూటీ సంస్కరణలు, ఏపీఐ(ఫార్మా) తయారీకి ప్రోత్సాహకాలు, వైద్య పరికరాల పునర్నిర్మాణ విధానం తీసుకువచ్చేలా చర్యలు సాగుతున్నట్లు కొందరు అభిప్రాయపడుతున్నారు.

# అలర్ట్- 149 మిలియన్ల జీమెయిల్, ఫేస్‌బుక్, నెట్‌ఫ్లిక్స్ యూజర్ల పాస్‌వర్డ్స్ లీక్!

**సుమారు 149 మిలియన్ల (14.9 కోట్ల) సోషల్ మీడియా యూజర్ల లాగిన్ వివరాలు లీక్**



సోషల్ మీడియా యూజర్లకు షాకింగ్ న్యూస్. కోట్లాది మంది డేటా లీక్ అయిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 14.9 కోట్ల మంది అకౌంట్లకు సంబంధించిన యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు 'ఎక్స్‌ప్రెస్ వీపీఎన్' పేర్కొంది. ఈ మేరకు సంచలన నివేదికను విడుదల చేసింది. డేటా లీక్ అయిన వారిలో జీమెయిల్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, నెట్‌ఫ్లిక్స్‌తో సహా పలు ఇంటర్నెట్ సంస్థలకు చెందిన యూజర్లు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఈ లీక్‌లో యూజర్‌నేమ్‌లు, పాస్‌వర్డ్‌లు వంటి అత్యంత సున్నితమైన కీలక సమాచారం ఉన్నట్లు సైబర్ భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. 'ఎక్స్‌ప్రెస్ వీపీఎన్' అనేది వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్. సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు జెరెమియా ఫౌలర్ ఈ లీకేజీలను గుర్తించినట్లు 'ఎక్స్‌ప్రెస్ వీపీఎన్' నివేదిక తెలిపింది.

**ప్రభుత్వాల డొమైన్ల లాగిన్ వివరాలు కూడా**

ఈ లీకేజీలో భయంకరమైన విషయం ఒకటి ఉంది. ఈ డేటాబేస్‌కు ఎలాంటి పాస్‌వర్డ్ రక్షణ గానీ, ఎన్‌క్రిప్షన్ గానీ లేదు. ఇందులో కేవలం యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లు మాత్రమే కాకుండా, అకౌంట్‌లోకి నేరుగా లాగిన్ అవ్వడానికి ఉపయోగపడే యూఆర్‌ఎల్ లింకులు కూడా ఉన్నట్లు ఫౌలర్ తెలిపారు. సాధారణ ప్రజల వివరాలే కాకుండా, వివిధ దేశాలకు చెందిన డొమైన్ల లాగిన్ వివరాలు కూడా లీక్ కావడం అత్యంత ఆందోళనకరమైన విషయమన్నారు. దీనివల్ల ప్రభుత్వ నెట్‌వర్క్‌లలోకి చొరబడటం, సైబర్ దాడులు చేయడం వంటి జాతీయ భద్రతకు సంబంధించిన ముప్పులు పొంచి ఉన్నాయని నివేదిక పేర్కొంది.

**లక్షల ఖాతాల వివరాలు లీక్**

జీమెయిల్‌కు సంబంధించి సుమారు 4.8 కోట్ల ఖాతాల యూజర్లు, యాహూకు సంబంధించి 40 లక్షల ఖాతాల వివరాలు, ఫేస్‌బుక్‌కు సంబంధించి 1.7 కోట్ల ఖాతాల క్రెడెన్షియల్స్, అవుట్‌లుక్‌కు సంబంధించి 15 లక్షల ఖాతాలు, ఇన్‌స్టాగ్రామ్‌కు సంబంధించి 65 లక్షల ఖాతాల వివరాలు లీకైనట్లు నివేదిక స్పష్టం చేసింది. ఇవేకాకుండా ఇతర అనేక ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన వివరాలు కూడా ఈ డేటాలో ఉన్నట్లు తెలుస్తోంది.

**పొంచి ఉన్న ప్రమాదం**

ప్రభుత్వ నెట్‌వర్క్‌ల లాగిన్ వివరాలు లీకైన నేపథ్యంలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అకౌంట్ హ్యాక్ చేయడం వల్ల రహస్య హ్యాకర్‌కు లభించకపోవచ్చు కానీ, ఒక ఉద్యోగి అకౌంట్ హ్యాకర్ల చేతికి వెళితే అతని ఉన్న క్రెడెన్షియల్స్‌ను వాడుకొని సంస్థగతమైన వివరాలను చోరీ చేసే అవకాశం ఉంటుంది. లీక్ అయిన వివరాలతో హ్యాకర్లు ప్రభుత్వ అధికారుల్లా ఇతర అధికారులకు మెయిల్స్ పంపవచ్చు. దీని ద్వారా ప్రభుత్వ నెట్‌వర్క్‌లనే హ్యాక్ చేసే ప్రమాదం ఉంది. ఇది జాతీయ భద్రత, ప్రజల రక్షణకు పెద్ద ముప్పు అని ఫౌలర్ హెచ్చరించారు. చాలా మంది వినియోగదారులకు తమ సమాచారం దొంగిలించబడిందనే విషయం కూడా తెలియదు. ఇంత భారీ స్థాయిలో పాస్‌వర్డ్‌లు లీక్ కావడం వల్ల వారి వ్యక్తిగత భద్రత ప్రమాదంలో పడిందని చెప్పాలి. పాస్‌వర్డ్స్ కాకుండా, నేరుగా అకౌంట్ ఓపెన్ చేసే యూఆర్‌ఎల్ లింకులు కూడా లీక్ కావడంతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్లను ఉపయోగించి అతి తక్కువ సమయంలో వేల అకౌంట్లలోకి హ్యాకర్లు చొరపడటానికి అవకాశం ఉంది. ఈ లీకేజీ వల్ల బ్యాంకింగ్, క్రిప్టో ఖాతాలూ ప్రమాదంలో పడినట్లు ఫౌలర్ తెలిపారు. బ్యాంకింగ్ లాగిన్‌లు, క్రెడిట్ కార్డ్ వివరాలు, ఫైనాన్షియల్ సర్వీసెస్ అకౌంట్లు, క్రిప్టో వాలెట్లు, ట్రేడింగ్ ఖాతాలు కూడా లీకేజీ జాబితాలో ఉన్నట్లు ఫౌలర్ వెల్లడించారు."లీకైన వాటిలో యూజర్ల యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లు ఉన్నాయి. ఆన్‌లైన్ సేవలతో పాటు దాదాపు అన్ని రకాల అకౌంట్లకు సంబంధించిన క్రెడెన్షియల్స్ లీక్ అయ్యాయి. ప్రభుత్వ డొమైన్లు కూడా లీక్ అయ్యాయి. తద్వారా ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్న ప్రతి అకౌంట్ ద్వారా కీలక వ్యవస్థల్లో హ్యాకర్ ప్రవేశించవచ్చు. లీక్ అయిన ప్రభుత్వ అధికారుల లాగిన్ వివరాలను ఉపయోగించి నిర్దిష్ట వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడులు చేసే అవకాశం ఉంది. డొమైన్ వివరాలు లీక్ అవ్వడం అనేది జాతీయ భద్రతకు ముప్పు అని చెప్పాలి" అని సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు జెరెమియా ఫౌలర్ అన్నారు.

# మ్యానిప్యులేటెడ్ చిత్రాలతో సమాజానికి తీవ్ర నష్టం

**జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు**

**కృత్రిమ మేధతో క్రియేట్ చేసిన చిత్రాలపై జోహో ఫౌండర్ స్పందన**

**కేంద్ర ప్రభుత్వం త్వరలో తీసుకురానున్న ఐటీ నిబంధనలను సమర్థిస్తున్నట్లు వెల్లడి - ఏఐ లేబులింగ్ నిబంధనలు ఖచ్చితంగా అవసరమన్న టెక్ దిగ్గజం**

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాయంతో సృష్టించిన కంటెంట్‌ను గుర్తించేలా లేబులింగ్ విధానాన్ని తీసుకురావాలన్న కేంద్రం నిర్ణయాన్ని ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం, జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు స్వాగతించారు. కేంద్రం నిర్ణయం సరైందని, నియంత్రణ నిబంధనలు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. మార్ఫింగ్ ఫొటోలు, నకిలీ సమాచారం సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల డీప్‌ఫేక్స్, ఏఐ సాయంతో సృష్టించిన మార్ఫింగ్ ఫొటోలతో ప్రముఖులు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన శ్రీధర్ వెంబు, వ్యక్తుల గోప్యతకు భంగం కలిగించే ఏ అంశమైనా అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. మార్ఫింగ్ చిత్రాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడానికి ఈ నిబంధనలు అవసరమన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి తాను పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు."మార్ఫింగ్ చేసిన చిత్రాల వల్ల ప్రజలకు చాలా నష్టం జరుగుతుంది. కాబట్టి మనకు ఈ నియంత్రణ కచ్చితంగా అవసరం. నేను దీనిని పూర్తిగా సమర్థిస్తున్నాను. వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే ఏ అంశాన్ని అయినా నియంత్రించాలి. మనం పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ఉంటాం. ఇలాంటి సమస్యలు




తలెత్తినప్పుడు వ్యవస్థ కూడా చాలా వేగంగా స్పందిస్తుంది.ఐటీ నిబంధనల్లో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం త్వరలో కొత్త రూల్స్‌ను తీసుకురానుంది. ఇదే సమయంలో ఏఐ కంటెంట్‌ను తప్పనిసరిగా లేబుల్ చేయడం ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫార్ముల బాధ్యతను మరింత పెంచాలని నిర్ణయించిన నేపథ్యంలో వెంబు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏఐ ద్వారా రూపొందించిన ఫొటోలు, వీడియోలపై కనీసం 10 శాతం మేర స్పష్టమైన లేబుల్ లేదా మార్కర్ ఉండాల్సి ఉంటుంది. ఆడియో క్లిప్‌ల విషయంలో మొదటి 10 శాతం వ్యవధిలో అది ఏఐ సృష్టించినదని తెలిపేలా ఉండాలి. చాట్ జీపీటీ, జెమినీ ఏఐ, గ్రోక్ వంటి ఏఐ సాధనాలను అందించే సంస్థలతో పాటు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు కూడా ఈ కంటెంట్ విషయంలో బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ అంశాలను కొత్తగా రూపొందించిన కొత్త ఐటీ రూల్స్ డ్రాఫ్ట్‌లో కేంద్రం పొందుపరిచింది.

**ఏఐ లేబులింగ్ ఉద్దేశం ఇదే**

ఏఐతో తయారు చేసిన కంటెంట్ నిజమా? కాదా? అన్నది వినియోగదారులు సులభంగా గుర్తించేందుకు వీలుగా చేయడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ ఇటీవల వెల్లడించారు. ఈ నిబంధనలు రూపకల్పన ప్రస్తుతం తుది దశకు చేరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిబంధనల ద్వారా డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారంతో వినియోగదారులకు కలిగే నష్టాన్ని నివారించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. కేంద్రం తీసుకొస్తున్న ఈ కొత్త నిబంధనలు ప్రధానంగా రెండు సెగ్మంట్ల బాధ్యతలను పెంచనుంది. అందులో ఒకటి ఏఐ టూల్స్ అందించే చాట్ జీపీటీ, గ్రోక్, జెమినీ వంటివి. రెండో సెగ్మెంట్‌లో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఉన్నాయి.

**డీప్‌ఫేక్‌లతో ముప్పు**

డీప్‌ఫేక్ ఆడియోలు, వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నాయని ఐటీ మంత్రిత్వ శాఖ హెచ్చరిస్తోంది. డీప్‌ఫేక్‌లతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీయడం, ఎన్నికలను ప్రభావితం చేయడం, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నట్లు కేంద్రం హెచ్చరించింది. సినీ ప్రముఖులు కూడా ఇటీవల డీప్‌ఫేక్‌లతో తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా టాలీవుడ్‌కు చెందిన మెగాస్టార్ చిరంజీవి, అక్కినేని నాగార్జున వంటి స్టార్స్ కూడా తమ ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేస్తున్నారుని కోర్టులను కూడా ఆశ్రయించిన సందర్భాలు ఉన్నాయి.

**గ్రోక్ వివాదంపై చర్చ**

ఇటీవల ఎలాన్ మస్క్‌కు చెందిన గ్రోక్ ఏఐ చాట్‌బాట్ వివాదం తీవ్ర చర్చకు దారితీసింది. 'గ్రోక్' ఏఐ ద్వారా మహిళలు, మైనర్ల అసభ్యకర చిత్రాలను సృష్టించడంపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. భారత ఐటీ మంత్రిత్వ శాఖ దీనిపై తీవ్రంగా స్పందిస్తూ, అటువంటి అశ్లీల కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని ఎక్స్‌ను సంస్థను ఆదేశించింది. చివరికి ఎక్స్ దిగివచ్చి, దానిని నివారిస్తామని పేర్కొంది.

# కొందామా.. అమ్ముదామా?

**బంగారం, వెండి ధరల పరుగుతో సందేహాలు**

**ఏడాదిలోనే విపరీతంగా పెరగటంతో కొనుగోళ్లపై భయం**

**'టార్గెట్' చేరుకుంటే కొంత విక్రయించొచ్చు: నిపుణులు**

**వేగంగా పెరిగాయి కాబట్టి స్వల్పకాలంలో కరెక్షన్‌కూ అవకాశాలు**

**దీర్ఘకాలంలో మాత్రం పటిష్టమైన రాబడులొచ్చే చాన్స్**

**ప్రస్తుతానికి ఏకమొత్తంగా కాకుండా సిప్ నయమని సూచనలు**

**హెడ్జింగ్ కోసం తప్పనిసరిగా పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండి**



బంగారం తులం లక్ష అంటే..? అమ్మో! అన్నారు!!. లక్ష దాటడమే అబ్బురం అనుకున్నారు. అలాంటిది నెలల వ్యవధిలో ఏకంగా రూ.1.65 లక్షలు దాటేసింది. ఇక వెండి గురించైతే చెప్పక్కర్లేదు. ఏడాదిన్నర కిందటి వరకూ కిలో లక్ష రూపాయలలోపే. లక్ష దాటడమే గగనం అనుకున్నారంతా. కానీ ఈ ఏడాదిన్నరలోనే ఏకంగా రూ.3.4 లక్షలకు చేరిపోయింది. నిజానికి ఊహలకు కూడా అందని పరుగులివి. సెంట్రల్ బ్యాంక్‌లు సైతం కొండంత నమ్మకంతో పసిడిని కొనుగోలు చేస్తుండటం... వ్యక్తిగత వినియోగ అవసరాలకుతోడు రిటైల్ ఇన్వెస్టర్లు, సంపన్నులు సైతం బంగారంవైపు చూస్తుండటం పసిడిని పరుగులు పెట్టిస్తున్నాయి.ఇక పారిశ్రామిక (సోలార్, ఈవీ తదితర) డిమాండ్ పెద్ద ఎత్తున పెరగ్గా.. సరఫరా ఆ స్థాయిలో లేకపోవడం, పెట్టుబడులకు సైతం ఇన్వెస్టర్లు మక్కువ చూపిస్తుండడంతో వెండి ధరలు ఆకాశమే హద్దుగా రివ్వుమంటున్నాయి. ఈ విలువైన లోహాల ధరలు గడిచిన మూడేళ్లుగా ఎప్పటికప్పుడు కొత్త గరిష్టాలను నమోదు చేస్తుండడంతో రాబడుల కాంక్షతో కొందరు దూకుడుగా పెట్టుబడులు పెడుతున్నారు. మరిప్పుడు ఏం చేయాలి? కొత్తగా కొనాలనుకున్న వారి పరిస్థితేంటి? ఇళ్లలో కిలోలకు కిలోలు వెండి ఉన్నవారు మంచి రేటు వచ్చింది కనక దాన్ని విక్రయిస్తే మంచిదా? ఒకవేళ బంగారం, వెండి వంటి మెటల్స్‌లో ఇన్వెస్ట్ చేయాలంటే ఎలా? ఈటీఎఫ్‌లవైపు చూడొచ్చా? అందరికీ ఇవే సందేహాలు. వాటికి సమాధానమే ఈ వెల్త్ స్టోరీ...

**ఉరుకులు పరుగులు ఎందుకంటే...**

2025 జనవరి నుంచి బంగారం ధర అంతర్జాతీయ మార్కెట్లో 79 శాతం పెరిగింది. ఔన్స్‌కు 2,780 డాలర్ల నుంచి 4,965 డాలర్లకు చేరగా, వెండి ఔన్స్ 30 డాలర్ల నుంచి 100 డాలర్ల స్థాయిని తాకింది. ఈ కాలంలో వెండి ఏకంగా 223 శాతం ర్యాలీ చేసింది. అంతర్జాతీయంగా వృద్ధి అంచనాలు మసకబారినప్పుడు లేదా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఎగసినప్పుడు (పలు దేశాల మధ్య ఘర్షణలు/ యుద్ధాలు తలెత్తడం).. ఇన్వెస్టర్లు రక్షణాత్మక ధోరణితో తమ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని బంగారం, వెండిలోకి మళ్లిస్తుంటారు. అలాంటి ఆర్థిక అనిశ్చితుల్లో పెట్టుబడుల విలువ కాపాడుకునే హెడ్జింగ్ సాధనంగా బంగారానికి గుర్తింపు ఉంది.డాలర్ బలహీనత సైతం బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోసేదే. డాలర్ విలువ తగ్గినప్పుడు ఇతర కరెన్సీల వారికి బంగారం, వెండి చౌకగా మారతాయి. కనుక అదనపు డిమాండ్ ఏర్పడుతుంది.యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించొచ్చన్న అంచనాలు కూడా ఒక కారణమే. వడ్డీ రేట్లు దిగొచ్చే క్రమంలో ఈల్డ్స్ తగ్గి బాండ్లు ఆకర్షణీయత కోల్పోతాయి. దీంతో అదనపు రాబడి వస్తుందనే కారణంతో పసిడి, వెండిలోకి పెట్టుబడులు పరుగెడుతుంటాయి.ఆర్‌బీఐ నుంచి అంతర్జాతీయంగా ఎన్నో దేశాల కేంద్ర బ్యాంక్‌లు తమ విదేశీ మారకం నిల్వల్లో బంగారానికి వెయిటేజీ పెంచుతున్నాయి. గత రెండు మూడేళ్లుగా కొన్ని సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం నిల్వలు అదే పనిగా పెంచుకుంటూ వెళుతున్నాయి.గోల్డ్, సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు)లోకి వచ్చే పెట్టుబడులు కూడా పెరగడం ధరలను మరింత ఎగిసేలా చేస్తోంది.వెండికి ప్రధానంగా పారిశ్రామిక రంగం నుంచి డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెళ్లు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెద్ద ఎత్తున పెరుగుతుండడంతో వీటి తయారీకి అదే స్థాయిలో వెండి అవసరం ఏర్పడుతోంది. ఈ స్థాయిలో సరఫరా పెరగకపోవడం ధరలను నడిపిస్తోంది.మన రూపాయి ఇటీవలి కాలంలో డాలర్‌తో విలువను కోల్పోతూ వస్తోంది. బంగారం, వెండిని డాలర్ రూపంలోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇది కూడా దేశీయంగా వాటి ధరలు అంతర్జాతీయ మార్కెట్ కంటే పెరిగేలా చేస్తోంది.ఒకవైపు ఈక్విటీలు ఏడాదిన్నరగా ఎలాంటి ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నాయి. మరోవైపు బంగారం, వెండి గణనీయంగా ర్యాలీ చేస్తుండడంతో.. ఇన్వెస్టర్లు వాటివైపు ఆకర్షితం అవుతుండడం ధరలను మరింత పెరిగేలా చేస్తోంది.

**రిటైల్ ఇన్వెస్టర్లు ఏం చేయాలి?**

బంగారం, వెండి ధరల పరుగును చూసి హడావిడిగా పెట్టుబడులు పెట్టేయాల్సిన పనిలేదు. ఉన్నట్టుండి వీటి ధరలు గణనీయంగా పెరగడమే కాదు.. వీటిల్లో దిద్దుబాటూ అదే విధంగా ఉండొచ్చు. స్వల్పకాలంలో వీటి డిమాండ్, ధరల తీరును కచ్చితంగా అంచనా వేయలేం. దీర్ఘకాలంలో మాత్రం బంగారం, వెండి మూలాలు పటిష్టమే అనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. కాబట్టి ధరలను చూసి ఉద్రేకపడాల్సిన పనే లేదు. ఇప్పటికే భౌతిక బంగారం కొనుగోలు చేసిన వారు గరిష్ఠ ధరల వద్ద విక్రయించి లాభం స్వీకరించాలనుకుంటే లేదా లిక్విడిటీ (నగదు లభ్యత) పెంచుకోవాలంటే లేదా తాము అనుకున్న లక్ష్యానికి చేరువ అయితే ముందుకెళ్లొచ్చు. భౌతిక రూపంలో విక్రయించే వారు జీఎస్టీ చార్జీలు, తరుగు రూపంలో లాభంలో కొంత నష్టపోవాల్సి ఉంటుందని గుర్తు పెట్టుకోవాలి. అనుకున్న లక్ష్యానికి బంగారం ధరలు చేరినట్టయితే పాక్షికంగా విక్రయించడం మంచి ఆలోచనే. ధరల పరుగు చూసి, మరింత పెరిగితే కొనలేమోమోనన్న భయం అవసరం లేదు. అధిక ధరల వద్ద కొనుగోలు చేసినప్పుడు స్వల్పకాలంలో కరెక్షన్ల రిస్క్ కూడా ఉంటుంది. బంగారం హెడ్జింగ్‌గానూ పనిచేస్తుంది కనుక కొనుగోలు చేసి, దీర్ఘకాలం పాటు నిల్వ ఉంచుకుంటే మంచి రాబడిని ఆశించొచ్చు. కాకపోతే దాని భద్రత కోసం చేయాల్సిన వ్యయాలు, జీఎస్టీ ఇతరత్రా చార్జీల ప్రకారం చూస్తే.. డిజిటల్ సాధనాలు అనుకూలం.

వెండి భౌతిక రూపంలో కొనుగోలు చేస్తే, తర్వాత నగదుగా మార్చుకోవడం కష్టం కావొచ్చు.

డిజిటల్ రూపంలో అయితే బంగారం, సిల్వర్ ఈటీఎఫ్‌లు, ఫండ్ ఆఫ్ ఫండ్స్, డిజిటల్ గోల్డ్ అందుబాటులో ఉన్నాయి.

ఇదీ చదవండి: నిర్మాణంలో ఉన్న ఇల్లు బెటరా?

**'సిప్' రూపంలోనే బెటర్...**

గరిష్ఠ ధరల వద్ద ఒకేసారి పెట్టుబడి పెట్టడం కాకుండా నెలవారీ నిర్ణీత మొత్తాన్ని గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేసుకోవడం అన్నింటిలోకి మెరుగైన మార్గమన్నది విశ్లేషకుల సూచన.

ఇక్కడి నుంచి ధరలు ఇంకా ముందుకే వెళ్లినా, లేక పతనాన్ని చూసినా పెట్టుబడి కొనసాగుతుంది. కొనుగోలు ధర సగటుగా మారుతుంది.

పెట్టుబడుల్లో వైవిధ్యానికి.. పోర్ట్‌ఫోలియో హెడ్జింగ్ కోసం చూసే వారు దీర్ఘకాలం కోసం బంగారంలో సిప్ రూపంలోఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

**ఎంత పెట్టుబడి..?**

ఒకరు తమ మొత్తం పెట్టుబడుల్లో బంగారం, వెండికి కేటాయింపులు 1020 శాతానికి పరిమితం చేసుకోవాలన్నది నిపుణుల సూచన. ఇలా చేయడం వల్ల ఒక విభాగంలో అధిక ఎక్స్‌పోజర్‌ను నివారించొచ్చు. అధిక రాబడులను ఇచ్చే ఈక్విటీలతోపాటు, పెట్టుబడులకు రక్షణనిచ్చే డెట్ సాధనాలు, బంగారంవెండి మధ్య తగినంత సమతుల్యం ఉండేలా చూసుకోవచ్చు.



# శాస్త్ర, సాంకేతిక, భాషలు, కళలను పరిరక్షిస్తాం



'మారుతున్న సమాజానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటుగా భాషలు, కళల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఏ రంగంలోనైనా పురోగతి ఉంటోంది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఇది మరింత వేగంగా కనిపిస్తుంద'ని మందలపు రవి తెలిపారు. అంతరించే భాషల్లో ఒకటైన మాతృభాషను మృతభాష కాకుండా పరిరక్షిస్తామని రాయపాటి విల్సన్ (శరత్‌చంద్ర) అంటున్నారు. భారతీయ వారసత్వంగా వచ్చిన కళలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పరిరక్షణే ధ్యేయమని వుంపూరు మంగులయ్య వెల్లడించారు. రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌గా రాయపాటి విల్సన్ (శరత్‌చంద్ర, కావలి నెల్లూరు జిల్లా), రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ ఛైర్మన్‌గా మందలపు రవి, పామర్రు-కృష్ణా జిల్లా), రాష్ట్ర జానపదం, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వుంపూరు మంగులయ్య (పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా) నియమితులైన సందర్భంగా 'జీవన' కోసం వారితో సంభాషించాం. ఆయా రంగాలకు వారు ఏం చేయబోతున్నారో అడిగి తెలుసుకున్నాం. ఆ వివరాలు ఇవిగో.

**శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే అభివృద్ధి**

రాబోయే కాలంలో ప్రపంచంలో శాస్త్ర, సాంకేతిక రంగాల ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుంది. కృత్రిమ మేథ, వేరబుల్, వర్చువల్ రియాల్టీ, త్రీడీ, రోబో, మెటావర్ తదితర సాంకేతికతల్లో పైచేయి సాధించాలి. కాలుష్య కారక ఇంధనాలకు స్వస్తి పలికి.. పునరుత్పాదక, హరిత ఇంధనాలపై దృష్టి సారించాలి. స్వయం చోదక వాహనాలకు మార్గం సుగమం చేసుకోవాలి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన నిర్మాణ సాంకేతికతలను అభివృద్ధి చేసుకోవాలి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) సాయంతో ఇళ్లు, కార్యాలయాలు, కార్లు, నగరాల్లోని డిజిటల్ సాధనాలతో అనుసంధానం పెంచుకోవాల్సివుంది. వాతావరణ మార్పులను అధిగమించే పరిజ్ఞానాలు, పర్యావరణ హిత విధానాలను ఆచరణలో పెట్టాలి. అంతరిక్ష పరిశోధనలు పెంచుకోవాల్సివుంది. రోగ నిర్ధారణ, చికిత్సల్లో రోబోటిక్-నానో సాంకేతికత వినియోగాన్ని పెంచాలి. క్వాంటం కంప్యూటింగ్ చాలా వేగం, ఖచ్చితత్వంతో కూడిన ప్రక్రియ. సమీప భవిష్యత్తులో ఊహించలేనంత వేగంగా జనజీవితంలోకి ఈ టెక్నాలజీ వచ్చేస్తుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ అడుగుజాడల్లో రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషిచేస్తాను.

**కళలకు పూర్వవైభవం తీసుకొస్తా**

తెలుగు కళలు, సాహిత్యం, కథలు, కవిత్వం, సినిమాటోగ్రఫీ తదితర వంటి వాటి ద్వారా సంస్కృతి పరిరక్షణకు కృషిచేస్తాం. కళా ప్రదర్శనల ఏర్పాటుతోపాటుగా ఔత్సాహిక కళాకారులకు ప్రోత్సాహకాలు ఉండేలా కృషిచేస్తాం. దళితులు, గిరిజనుల్లోని ప్రత్యేకమైన కళలను వెలుగులోకి తెస్తాం. అంతరించిపోతున్న కళారీతులను పరిరక్షించి, ఆధునీకరించే కృషి చేపడతాం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తెలుగు భాషతోపాటుగా కళలు, సాంస్కృతిక వికాసానికి పెద్దపీట వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల ఆశీస్సులతో రాష్ట్రంలో జానపద కళలు, సాంస్కృతిక రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తా. రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌తో ఇప్పటికే కళారంగ పరిరక్షణ కోసం, అభివృద్ధి కోసం కలిసి మాట్లాడాను. జానపద కళలు, తెలుగు సంస్కృతి పరిరక్షణకు అవసరమైన నిధులు కేటాయింపునకు ఆయన అంగీకరించా రు. ఎన్టీఆర్ ఆకాంక్షించిన జానపద కళారూపాల పరిరక్షణకు కృషిచేయటం ద్వారా పూర్వవైభవం వచ్చేలా కృషిచేస్తా. విశాఖ స్టీల్‌ప్లాంట్ పోరాటంలో నేను కూడా పవన్ కళ్యాణ్‌తో పనిచేశా. గతంలో గద్దర్, వరవరరావు, వంగపండు వంటి నేతలతో కలిసి పనిచేసిన అనుభవం ఉంది. గిరిజనులు, ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన ఉద్యమ నేతగా గుర్తింపు పొందా. అందుకే పవన్ కళ్యాణ్ నాకు ఈ బాధ్యత అప్పగించారు.

**భాషా సాహిత్యాల వికాసానికి ప్రణాళికలు**

ఇప్పటి వరకూ తెలుగు, సంస్కృత అకాడమీ కేవలం పుస్తకాల ముద్రణకే పరిమితమైంది. ఇక నుంచి పుస్తకాల ప్రచురణలను మరింత విస్తృత పర్చటం ద్వారా ఇంగ్లీషు మింగేస్తున్న భాషలను బతికించటానికి కృషిచేస్తా. ప్రాంతీయ, దేశ, అంతర్జాతీయ భాషలపై అవగాహన మంచిదే. అవసరం కూడా. ఆ పేరుతో ప్రాంతీయ భాషలను పూర్తిగా వదిలేస్తే జన జీవన నాడిపై తీవ్ర ప్రభావం పడుతుంది. వాడుక భాషను వదిలేస్తే భావి తరాలు తీవ్రంగా నష్టపోతాయి. వారి జీవనం, మనసు, మెదడుపై కూడా ఆ ప్రభావం కన్పిస్తుంది. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ యూనివర్శిటీ స్థాయి వరకూ మాతృభాషలో బోధన ఉంటే మంచిదని ప్రబోధించారు. కానీ ఇప్పుడు ప్రాథమిక దశలోనే తెలుగు లేకుండాపోతే ఎలా?.కనీసం ఆరో తరగతి వరకైనా మాతృభాషలో బోధన ఉండాలని శక్తివంచన లేకుండా కృషిచేస్తాం. తెలుగు, సంస్కృత భాషల్లో మరింత విస్తృతంగా సాహిత్యం వచ్చేలా ప్రోత్సహిస్తాం. నిష్ణాతులైన పెద్దలు, నిపుణులు, భాషా వేత్తల అభిప్రాయాలు తీసుకుంటాం. మా అకాడమీ ద్వారా రాష్ట్రంలోని 50 మంది జన రంజక కవుల పేర్లను ఎంపికచేసి వారి జీవిత గాథలను అకాడమీ ద్వారా ప్రచురిస్తాం.భావితరాలకు వారి సందేశాలు. సాహిత్యం ఎంతో అవసరం. వారి త్యాగాలు అనన్య సామాన్యం. అందుకే అలాంటి మహనీయుల జీవితాలు భావితరాలకు తెలియజేస్తే సాహిత్యం రానున్నకాలంలో మరింత సుసంపన్నం అవుతుందనేది నా భావన. తెలుగు భాష, సాహిత్యం, మాండలికాలు, పద్య, గద్య అంశాలు మరింత విస్తృతంగా సాహిత్య రూపంలో అకాడమీ ప్రచురణల ద్వారా వెలుగులోకి రావటానికి కృషిచేస్తాం. ఎపిపిఎస్‌సి ద్వారా నిర్వహించే గ్రూప్ -1 నుంచి గ్రూప్-4 పరీక్షలకు అవసరమైన నాణ్యమైన, మంచి కంటెంట్‌తో పుస్తకాలను ప్రచురిస్తాం. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ పరీక్షల పుస్తకాలే కాకుండా పోటీ పరీక్షల బుక్స్ రూపకల్పన, ప్రింటింగ్‌కు ప్రాధాన్యత ఇస్తాం. ఏటేటా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం రోజున తెలుగు, సంస్కృత భాషల విస్తృతికి కృషిచేసే వారిని గుర్తించి పురస్కారాలు ప్రదానం చేస్తాం.

# ఆ ఫొటోల్లోని నిజం మాట్లాడుతోంది!



సముద్ర అలలని అదిమి పెట్టాలనుకోవడం మతి మాలిన చర్య. సత్యాన్ని గొంతు నులిమి చంపేయాలనుకోవడం కూడా అలాంటి నిరంకుశ చర్యే. ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా, ఏ ప్రజలు ఎంతలా అన్యాయానికి గురయ్యారో తమ వార్తలతో, ఫొటోలతో వాస్తవాలని చూపిస్తారు జర్నలిస్టులు. ఈ క్రమంలో దాడులకు, హత్యలకు గురవుతున్నా సత్యం తరఫున నిలబడతారు. ఇజ్రాయిల్ దురాగతాలను రిపోర్టింగ్ చేస్తున్న అల్–జజీరా జర్నలిస్టులపై ఇటీవల ఇజ్రాయిల్ బాంబుదాడికి పాల్పడి హత్య చేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న ఆ జర్నలిస్టుల నిర్జీవ శరీరాలను చూసి వారి మిత్రులే కాదు, గాజా ప్రజలు కూడా కన్నీరు కార్చారు. వారి దీన కథలను, బాధలను ప్రపంచానికి చూపించిన జర్నలిస్టు మిత్రులను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన చెందారు. ప్రపంచ ఫొటోగ్రఫీ డే జరుపుకునే ఈ రోజున నిబద్ధత గల అలాంటి జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్ల గురించి ప్రతి ఒక్కరూ చర్చించుకోవాలి.

**వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలి.**

యుద్ధం, ప్రకృతి విపత్తులు, పాలకుల దౌర్జన్యాలు, అమాయకుల ఆర్తనాదాలు.. ఇలా ఎన్నెన్నో వార్తాకథనాలను కళ్లకు కట్టినట్లు చూపించడం అంత ఆషామాషీ కాదు. మొన్నీ మధ్య దేశాన్ని కుదిపేసిన కర్నాటక ధర్మస్థల మూకుమ్మడి హత్యల వార్తలు పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ వార్తలు రావడానికి ముందే ఎన్నో ఏళ్లుగా ఈ దురాగతాలను ఫొటోలతో సహా వెలికితీశారు కొంతమంది జర్నలిస్టులు. వాస్తవాలు చెప్పినందుకు వారిపై దాడులు చేశారు. అక్రమ కేసులు బనాయించారు. బెదిరించారు. ఎన్ని కుయుక్తులు పన్నినా నిజాన్ని ఎవరూ చంపలేరు. భూమిలో పాతరేశామనుకున్న నిజం మిరుమిట్లు గొలిపే కాంతితో మళ్లీ పుట్టుకొచ్చింది. ఆధారాలతో సహా వచ్చిన అజ్ఞాత వ్యక్తికి అంత బలమిచ్చింది గతంలో ఈ దుర్ఘటనలపై ప్రచురితమైన వార్తలు, ఫొటోలు అన్నది కాదనలేని నిజం.రోడ్లు, డ్రైనేజీలు సరిగ్గా నిర్మించలేదని ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎప్పటికప్పుడు వార్తలు అందిస్తారు మన జర్నలిస్టు మిత్రులు. డోలీ మోతలు, వరదల్లో అవస్థలు, స్కూలు పిల్లల ప్రమాదకర ప్రయాణాలు ఇలా ఎన్నో వార్తలకు బలం చేకూర్చే ఫొటోలు అక్కడి పరిస్థితిని కళ్లకుకట్టినట్లు చూపిస్తాయి. అధికారులను పరుగులు పెట్టిస్తాయి. ఈ ప్రయాణంలో వారికి ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.ఇటీవల పూణేలో స్నేహ భర్వే అనే యువ జర్నలిస్టు అక్రమ కట్టడాలపై గ్రౌండ్ రిపోర్టు చేస్తుండగానే ఆమెపై గుండాలు కర్రలతో దాడి చేశారు. ఆమె మైక్‌ని విరగ్గొట్టారు. తల నుండి రక్తం కారేలా కొట్టారు. వెన్నుపూసపై పదే పదే కొట్టడంతో ఇంటర్నల్ బ్లీడింగ్, ఫిట్స్ వచ్చి స్నేహ ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ఎప్పుడు ఏ వార్త వింటామో అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వెలుగులోకి రాని ఇటువంటి దాడులు కోకొల్లలు. ఈ దాడి తరువాత స్నేహ గొంతు మూయించామని ఆ దుండగులు విర్రవీగినా ఆమె చూపించిన వార్తల్లో నిజం కణకణ మండే నిప్పులా ఎగిసిపడింది. అధికారబలంతో నిందితులు ఇప్పటికీ అరెస్టు కాలేదు. అయినా ప్రజల్లో వారిపై నిరసన పెల్లుబికింది. నిజానికి ఉన్న శక్తి అలాంటిది. వాస్తవాన్ని కళ్లకి కట్టినట్టు చూపించిన ఆ వార్తాకథనాలది. ఫొటోలది.చాలాకాలం క్రితం ఉత్తరప్రదేశ్ ఉన్నావ్‌లో అత్యాచారం చేసి అన్యాయంగా మట్టుపెట్టిన బాధితురాలిని, అర్ధరాత్రి మంటల్లో కాల్చేస్తున్న దృశ్యాలని తమ కెమెరాల్లో బంధించి ప్రపంచానికి చూపించారు కొంతమంది జర్నలిస్టులు. నిజాన్ని మంటల్లో బూడిద చేశామని జబ్బలు చరుచుకున్న దుండగులు వెలుగులోకి వచ్చిన ఆ ఫొటోలతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కేసులతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రతిగా అక్రమ కేసులు బనాయించి జర్నలిస్టులను జైళ్లల్లో పెట్టించినా వారు వెలికితీసిన నిజం మాత్రం ఇప్పటికీ సజీవంగా మండుతూనే ఉంది. కంట్లో నలుసులా పాలకులను ముప్పుతిప్పలు పెడుతూనే ఉంది.పది రోజుల క్రితం ఉత్తర గాజాలో జర్నలిస్టులపై జరిగిన దాడి కూడా ఇలాంటిదే. మహ్మద్, అనాస్, నౌఫాల్, ఇబ్రహీం, జహీర్ ఆశ్రయం పొందుతున్న శిబిరాన్ని లక్ష్యం చేసుకుని ఇజ్రాయిల్ బాంబు దాడి చేసింది. ఇంతలా వారిపై కక్ష కట్టడానికి కారణం వారు వెలికితీసిన



నిజాలు. గాజాపై ఇజ్రాయిల్ దాడులకు తెగబడినప్పటి నుండి అనాస్ అక్కడే ఉండి రిపోర్టింగ్ చేస్తున్నాడు. దాడుల్లో తన తండ్రిని, సోదరుడిని కోల్పోయాడు. అయినా వెనుదిరగలేదు. పాలస్తీనా ప్రజలు పడుతున్న బాధలను తన కెమెరా కంటితో ప్రపంచానికి చూపించాడు. వారి కథలను జనంలోకి తీసుకెళ్లాడు. ఇప్పటివరకు జరిగిన దాడుల్లో గాజాలో సుమారు 270 మంది జర్నలిస్టులు హత్య చేయబడ్డారంటేనే వారు బహిర్గతం చేసిన నిజాలు ఎంత ప్రభావం చూపించాయో అర్థమవుతుంది. వారు మరణించినా వారు చూపించిన నిజాలు మాత్రం ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. మరణం వారికి మాత్రమే.. వారు అందించిన వార్తలు, చూపించిన ఫొటోలు ప్రపంచం ఉన్నంతకాలం జీవించే ఉంటాయి.

# జన సంస్కృతికి ప్రతిరూపాలు



నిద్రపోతూ కనేది కల.. నిద్రావస్థలో ఉన్న జనాన్ని మేల్కొలిపేది కళ.. ఆ కళకు ఎన్నో రూపాలు. వాటిల్లో ఎప్పటికీ ఆదరణ తగ్గనవి జానపద కళలు. ఇవి అనాదిగా జనాల మాటలు, అనుభవాల్లోంచి పుడుతున్నవే. ఆంధ్రుల వికాసంలో జానపద కళలు భాగమయ్యాయి. ఇవి జనజీవన సంస్కృతికి ప్రతిబింబాలు. జీవన సమరంలో సుఖదు:ఖాలను బాణీలుగా చేసుకొని వెలసిన జానపదాలు. విజ్ఞాన, వినోదాలను పంచేవిగా ఉన్నాయి. జానపదం అంటే పల్లె. పల్లె జనాలు పాడుకునే పాటలు, ఆటలు, నృత్యాలు, సామెతలు ఈ కోవకిందకు వస్తాయి. ఒక సమూహంగా జీవించే వారి జీవన విధానం జానపదం. ఈ పదాన్ని 22 ఆగస్టు 1846 తొలిసారి ఉపయోగించిన విలియం జాన్‌థారుస్ అనే భాషాశాస్త్ర వేత్త స్ఫూర్తితోనే 'వరల్డ్ ఫోక్‌డే'ను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

**శ్రమలో నుంచి పుట్టిన పాటలేల**

తరతరాల మన జన సంస్కృతికి ప్రతిబింబంగా జానపదం విరాజిల్లింది. చలన చిత్రాలు, టెలివిజన్లు లేని రోజుల్లో ఆనాటి ప్రజలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని, ప్రాపంచిక విజ్ఞానాన్ని అందించిన ఘనత జానపద కళలకే దక్కుతుంది. జనపదాలు మన ప్రాచీన సాంస్కృతిక, జనజీవన విధానానికి, వస్తు, ఆహార సంస్కృతికి, ఆచార వ్యవహారాలకి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తాయి. నిరక్ష రాస్యులుగా పిలువబడి ఒక ప్రత్యేక సంస్కృతికి ప్రతీకగా నిలిచిన జానపదులు నిజంగా ఈ ప్రపంచానికి అన్నం పెడుతున్న శ్రమజీవులు. స్వార్థం ఎరుగని ఉపకార తత్వం గల సేవానిరతికి ఆదర్శప్రాయులు. రెక్కాడితే గాని డొక్కాడని జానపదులు శ్రమను మరచిపోవడానికి పనిలోపాడే పాట ఒక్కొక్కటి అత్యద్భుతం. నవ రసాలు పల్లవించే జానపదుల పనిపాటల్లో గుండె దరువు, గుండె బరువు, కన్నీళ్ళు, కష్టాలు అన్నీ అనుభవంతో ముడిపడినవే. అందుకే జానద గేయాలు మనసును ఆకర్షిస్తాయి. కొన్ని గేయాలు ఆలోచింపచేస్తాయి. జానపదులు నోళ్ళనుండి వచ్చే ఆశుకవిత్వం ఎంతో హృద్యంగా మనసులను రంజింపచేస్తుంది. మానవీయ సంబంధాలు, అనుబంధాలు, ఆప్యాయతానురాగాలు, కుటుంబ జీవన విధానాలను పట్టిచూపుతాయి. వరి కోతపాటల్లోనూ, కుప్పనూర్పుల్లోనూ, వివిధ ప్రదర్శన కళారూపాల్లోనూ కనిపిం చేగేయాలు ఎంతో వినోదాన్ని, ఆనందాన్ని, ఉల్లాసాన్ని కల్గిస్తాయి.వందలాదిగా ఉన్న కళారూపాలు అభ్యుదయం, సాహిత్యవైభవం, వినోదం, ఆనందం, జీవన ఔచిత్యాన్ని తెలియజేసేవే. వాటిలో కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. మరికొన్ని కొన ఊపిరితో ఉన్నాయి, ఇంకొన్ని కొత్త హంగులు సంతరించుకొని వేదికలపై వెలుగొందుతున్నాయి. జానపద కళలు అకస్మాత్తుగా ఆకాశాన్నుంచి ఊడిపడ్డవి కావు. అవి జానపదుల చెమట నుంచి, శ్రమ నుంచి ఆవిర్భవించినవే. జానపదులు శ్రమలు మర్చిపోవడానికి పాట అవసరమైంది. వారి నోట నుండి అప్రయత్నంగా ఆశువుగా వెలువడే గేయమే కళారూపాలకు ప్రాణం పోసింది. ఆ గేయంతోనే అడుగులు, చిందులు, గంతులతో, రకరకాల గమకాలతో, వివిధ ధ్వనులతో, అనేక దరువులతో కూడి వివిధ కళారూపాలు ఏర్పడ్డాయి. అందుకే



జానపద కళలు మన సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి.

**ప్రపంచీకరణ ప్రభావం**

ఒకప్పుడు వ్యవసాయంలో ఎంతో ఆదరణ పొందిన కళారూపాలు ప్రపంచీకరణ ప్రభావంతో ఆధునిక యంత్రాల రాకతో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. పచ్చని పంట పొలాల్లో యంత్రాల రణగొణ ధ్వనులే వినిపిస్తున్నాయి. ప్లాట్ల రూపంలో అమ్మకాలకు సిద్ధమైన నేల పచ్చదనానికి దూరమవుతోంది. పచ్చదనం అంటే పల్లె ఉంటుంది. పల్లె ఉంటే పాడి, పంట ఉంటుంది. ఆ పాడి పంటతోనే పని ఉండేది. ఆ పనితోనే పాట ఉండేది. పని పాటతో కళారూపాలు ఊపిరి పోసుకునేవి. కానీ ఇప్పుడు ఊడ్పుల దగ్గర నుంచి కోతకోసే వరకు యంత్రాలే పనిచేస్తున్నాయి. అందుకే పల్లెల్లో జానపద కళలు, గేయాలు, పూర్తిగా కనుమరుగయ్యాయి.

**కనుమరుగవుతున్న కళారూపాలు**

జానపద కళారూపాల్లో ముఖ్యంగా చెక్క, చిందు భజనలు, చెంచిత, జవిటిక, రుంజ, తంబుర కథలు, పగటి, శక్తి వేషాలు, కత్తిసాము, కర్రసాము, ఇలాంటి కళలు గతంలో అందరినీ ఆకర్షిస్తూ విశేష ప్రాచుర్యాన్ని పొందేవి. వందలకొలదిగా ఉన్న కళారూపాల్లో కనుమరుగౌతున్న వాటిలో గంగిరెద్దులాటలు, మాస్టీడీ, మల్లికాసుల ఆటలు, కొమ్ము బూరలు, కోల సంబరాలు, కనికట్టు, మోడి, బుడబుక్కలాటలు, కొమ్మదాసరి ఆటలు, దొమ్మరాటలు, అగ్నిగుండాలు, శూల నృత్యాలు, వంటివి ప్రస్తుతం మసగబారి పోతున్నాయి.

**పల్లెల్లోనూ కనిపించట్లా**

%ఒకప్పుడు పల్లెల్లో పిల్లలు దగ్గర నుంచి పెద్దల వరకు చక్కగా ఆడుకొనే ఆటలు కనబడటం లేదు. వాటిలో ముఖ్యంగా బొంగరాల ఆట, గూటిబిళ్ళాట, చింతపిక్కలు గవ్వలతో ఆడే సీతారాముడు ఆట, గచ్చనకాయలు, కోతి కొమ్మచ్చి, దాగుడుమూతలు, అరుగు మీద సుద్దతోనో, బొగ్గుతోనో గీసి ఆడుకొనే పులిమేక ఆట, వీటితో పాటు చిన్నపిల్లలు ఆడుకునే దూదూ పుల్ల దుక్కుడు బిళ్ళాట, దొంగపోలీసు, గోళీలాట, ఏడు పెంకుల ఆట, కబాడీలో కనిపించే వివిధ రకాలైన కూతలు పూర్తిగా కనుమరుగయ్యాయి. జానపదాల్లో ఏమూల విన్నా ఏదో ఒక గేయమో, కళా రూపమో కనపడేది, వినబడేది. ఇప్పుడు మన ప్రాచీన సాంస్కృతిక శోభ సన్నగిల్లింది. సంక్రాంతి పర్వదినాల్లో కూడా హరిదాసులకు పెద్దగా ఆదరణ ఉండటం లేదు. గంగిరెద్ల మేళాలు కూడా కనుమరుగవుతున్నాయి. శుభకార్యాల్లో గతంలో పాటలు ఉండేవి. ఇప్పుడు వినపడటం లేదు.

**'జానపదం'పై పరిశోధనలు చేశా**

జానపద ప్రదర్శన కళలపై పరిశోధన చేసి ఆంధ్రవిశ్వ విద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టాను తీసుకోవడమే కాకుండా ఉత్తమ సిద్ధాంత గ్రంథంగా 'బెస్ట్ థీసిస్' అవార్డు, స్వర్ణపతకాన్ని అందుకున్నా. యుజిసి, జెఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ పరిశోధకునిగా, ఉత్తమ పరిశోధన చేశా. ఏటేటా అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవాలను నిర్వహిస్తూ ఇప్పటి వరకు 160 మంది కళాకారులను సత్కరించాం. పలు జానపద కళారూపాలను ప్రదర్శనలు ఏర్పాటుతో



నేటి తరానికి మన కళల ప్రాధాన్యతను తెలియజేస్తున్నాం. ఈ ఉత్సవాలకు అతిథులుగా జానపద విజ్ఞాన వేత్తలైన గోరటి వెంకన్న, సుద్దాల అశోక్‌తేజ్, అందెశ్రీ, వంగపండు ప్రసాద్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, వెనిగెళ్ళ రాంబాబు వంటి వారితోపాటుగా విదేశీ సాహితీ ప్రతినిధులు, ప్రముఖులు హాజరై తమ సందేశాలను ఇచ్చారు. ఫ్రెంచ్ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ నేజరస్ డేనియల్ పేరిస్‌తోపాటు దేశంలోని పలు విశ్వవిద్యాలయాల జానపద విజ్ఞానవేత్తలు కూడా ఇందులో భాగస్వాములయ్యారు. 30 జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించడమే కాకుండా అనేక 20 వరకు గ్రంథాలను ప్రచురించాం.



# సున్నా నుండి స్టార్ వరకు

సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఎన్నో వీడియోల్లో ముంబయికి చెందిన వర్ష సోలంకి డ్యాన్స్ వీడియోలు కూడా ఉంటాయి. ఆ వీడియోలన్నీ ఔరా అనేలా ఉంటాయి. ఎంతో ప్రతిభ ఉన్న కళాకారిణిలా ఆమె వేసే స్టెప్పులకు తన ఫాలోవర్స్ లైక్‌ల మీద లైక్‌ల కొడుతుంటారు. అయితే వర్ష శిక్షణ పొందిన కళాకారిణి కాదు.. ఒక బిడ్డకి తల్లి. చిన్న వయసులో తను అనుభవించిన పేదరికం ఆమెని ఇంటి పనిమనిషిగా మార్చింది. తాగుడికి అలవాటు పడిన బాధ్యతలేని తండ్రి వల్ల అమ్మకు సాయంగా ఇళ్లిళ్లు తిరిగి పనిచేసింది. ఇన్ని కష్టాలు అనుభవిస్తున్న వర్షకి డ్యాన్స్ చేయాలన్న కోరిక బలంగా ఉండేది. అయినా అది తన బాల్యం, యవ్వనంలో తీరే దారి కనిపించలేదు. భవిష్యత్తులో తీరుతుందన్న ఆశా లేదు. అయితే వర్ష మాత్రం తన కోరికని అలా వదల్లేదు. సోషల్‌మీడియాని వేదికగా చేసుకుంది. తనకి వచ్చిన స్టెప్పులతో డ్యాన్స్ చేసి అప్‌లోడ్ చేసింది. మొదట్లో ఎన్నో అవమానాలు వచ్చాయి. భరించింది. ట్రోల్ చేశారు. సహించింది. ఎప్పుడైతే తన స్టోరీని ఇన్‌స్టాలో పోస్టు చేసిందో అప్పుడే ఆమె స్ఫూర్తివంత ప్రయాణం జనాలకి తెలిసింది. పనిమనిషి నుండి ఆమె ఎదిగిన తీరుని వైరల్ చేశారు. ఓ డ్యాన్స్ షోలో ప్రదర్శన ఇచ్చేంతగా ఆ డ్యాన్స్ వీడియోలు వైరల్ అయ్యాయి.బాలీవుడ్ దిగ్గజ నటుల సమక్షంలో 'డ్యాన్స్ దివానే' డ్యాన్స్ షోలో ఆమె చేసిన ప్రదర్శన చూసి జడ్జిలు అబ్బురపడ్డారు. ఆ తరువాత తన కథ తెలిసి గుండెలకి హత్తుకున్నారు. ఇది ఒక అమ్మ సాధించిన విజయం. పనిమనిషిగా మొదలైన వర్ష ప్రయాణం డ్యాన్సర్‌గా ఆమెని నిలబెట్టింది. 'ఇది జీవితం నాకిచ్చిన రెండో అవకాశం. ఈ స్థాయికి వస్తానని నేను కలగనలేదు. నేనెంతో ఇష్టపడ్డ డ్యాన్స్ నన్ను ఇంతమంది హృదయాలు గెలుచుకునేలా చేసింది' అని వర్ష ఒకింత భావోద్వేగంగా ఆ డ్యాన్స్ షోలో మాట్లాడిన మాటలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయి. 'నువ్వు నిజమైన హీరోవి. ప్రజలు నీ నుండి ఎంతో నేర్చుకోవాలి. ఎన్ని కష్టాలు వచ్చినా నువ్వు ధైర్యంగా నిలబడ్డావు' అని వర్షని ఉద్దేశించి జడ్జిలు చేసిన వ్యాఖ్యలు కూడా వాస్తవం. సున్నా నుండి ప్రారంభమైన వర్ష జీవితం ఇప్పుడు తనని ఓ స్టార్‌ని చేసింది. ఇన్‌స్టాలో 68 లక్షల ఫాలోవర్లతో ప్రముఖుల స్థానంలో నిలిచేలా చేసింది.

Published by R.S ROSHINE Printed by R.S. ROSHINE On behalf of R.S. ROSHINE Printed at J.M. Process, No 29, V.N. Doss Road, BorderThottam, Mount Road, Chennai - 600002. and Published From NO. 42/62, Buchammal Street, 1st Floor, New Washermenpet, Tondiarpet, Chennai, Tamilnadu - 600081. Editor: R.S. ROSHINE .